Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 239 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 2 - 5 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం: 2015

# బెంగాల్‌లోని 15 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్.. ఈసీ సంచలన నిర్ణయం



**న్యూఢిల్లీ:** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కొన్నిచోట్ల అవకతవకలు జరిగినట్టు వచ్చిన ఫిర్యాదులపై భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. రెండు నియోజకవర్గాల్లోని 15 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించాలని నిర్ణయించింది. మగ్రహత్ పశ్చిమ్ నియోజకవర్గంలోని 11, డైమండ్ హార్బర్ నియోజకవర్గంలోని 4 పోలింగ్ బూత్‌లలో మే 2న రీపోలింగ్ జరుపనున్నట్టు ప్రకటించింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందని ఎన్నికల సంఘం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈనెల 29న జరిగిన ఎన్నికలకు సంబంధించి 142-మగ్రహత్ పశ్చిమ్ ఏసీ, 143-డైమండ్ హార్బర్ ఏసీ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారుల నుంచి అందిన సమాచారం ప్రకారం ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 58లోని సబ్ సెక్షన్ (2)కింద 15 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్‌కు ఎన్నికల కమిషన్ నిర్ణయించినట్టు ఈసీ తెలిపింది. కాగా, రీపోలింగ్‌కు సంబంధించి పోలింగ్ ఏరియాల్లో విస్తృతమైన ప్రచారం జరపాలని, తాజా పోలింగ్‌కు సంబంధించిన సమాచారాన్ని అభ్యర్థులకు లిఖితపూర్వకంగా తెలియ జేయాలని సంబంధిత అధికారులను ఈసీ ఆదేశించింది. ఏప్రిల్ 29న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తుది విడత పోలింగ్ ముగిసింది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.










**కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో నూతనంగా నిర్మించిన ఎల్‌వీ ప్రసాద్ ఐ కేర్ సెంటర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. అనంతరం ఐ కేర్ సెంటర్‌లోని వివిధ విభాగాలను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు.**

# దేశంలోనే అత్యధికంగా పింఛన్లు ఇచ్చే రాష్ట్రం ఏపీ : హోం మంత్రి అనిత



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** పాయకరావుపేట నియోజకవర్గంలో హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం పర్యటించారు. కోటవురట్ల మండలం రామచంద్రపురం గ్రామంలో హోం మంత్రికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. రామచంద్రపురం గ్రామంలో హోం మంత్రి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం రామచంద్రపురం గ్రామంలో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిం చారు. కోటవురట్ల మండలం సుంకపురు గ్రామంలో గంగమ్మ తల్లి పండగ సందర్భంగా అమ్మవారిని అనిత దర్శించుకున్నారు. ఆపై హోం మంత్రి మాట్లాడుతూ...అంకితభావం, కృషితో సమాజాన్ని ముందుకు నడిపిస్తున్న శ్రామిక సోదర సోదరీమణులందరికీ అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మికులు, కర్షకులే దేశ ఆర్థిక వ్యవస్థకు పునాది అని అన్నారు. రెండోసారి పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా తనకు అవకాశం కల్పించి నందుకు సీఎం చంద్రబాబు, నారా లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా రెండవసారి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నాయని హోం మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. రామచంద్రపురం గ్రామంలో కోటి 16 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. 2014 - 19 సమయంలో పందూర్ బ్రిడ్జిని శంకుస్థాపన చేస్తే... మరలా ఎన్డీఏ ప్రభుత్వంలోనే బ్రిడ్జి పనులు పూర్తి చేశామని చెప్పారు. దేశంలోనే అత్యధికంగా పింఛన్లు ఇచ్చే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఎన్‌ఆర్‌ఈజిఎస్ రూ.40 కోట్లు, ఆర్ అండ్ బి నుంచి 40 కోట్ల రూపాయలతో వివిధ పనులు చేసినట్లు తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలో పరిశ్రమల రాకతో పెద్ద సంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు రానున్నాయన్నారు. స్టీల్ ప్లాంట్ రాకతో ఈ ప్రాంతం రూపురేఖలు మారనున్నాయని, కోటవురట్ల మండలంలో కూడా పరిశ్రమలు తీసుకొస్తామని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

# జగన్‌కు మానసిక సమస్య ఉంది.. సీఎం సెటైర్లు



**కృష్ణా జిల్లా, (రాజధాని వార్తలు):** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పార్టీ కాదని.. కోడికత్తి, గొడ్డలి పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. జగన్‌కు మానసిక సమస్య ఉందని సెటైర్లు గుప్పించారు. ప్రజలు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని నాశనం చేశారని.. అలా చేయడమే ఆయనకు అల వాటుగా మారిందని విమర్శించారు. ఆయన మానసిక పరిస్థితి అందరినీ మోసం చేయడమేనని.. ఆ తర్వాత మాట మార్చడమే పనిగా పెట్టుకున్నారని ఆక్షేపించారు. 2019లో అధికారంలోకి వచ్చిన తొలి సమావేశంలోనే ప్రజావేదికను కూల్చేశారని ధ్వజమెత్తారు. రెండేళ్లు కష్టపడి కడితే.. రెండు గంటల్లోనే దానిని కూల్చేశారని మండిపడ్డారు. శుక్రవారం కృష్ణా జిల్లా పమిడిముక్కలలో సీఎం చంద్రబాబు పర్యటించారు. 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. అమరావతి రాజధాని కావడంతో స్థానిక రైతుల దశా దిశ మారిపోయిందని చెప్పుకొచ్చారు. విశాఖపట్నం తర్వాత అభివృద్ధి, ఆదాయంలో ముందుండేది కృష్ణా జిల్లా అని పేర్కొన్నారు. ఏపీకి పునర్వైభవం తీసుకొస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చానని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రజల సంతోషంతో తన కష్టాన్ని మర్చిపోతున్నానని అన్నారు. పింఛన్ల పంపిణీని భారంగా భావించట్లేదని.. బాధ్యతగా తీసుకున్నామని స్పష్టం చేశారు. కార్మికుల కోసం అత్యాధునిక పనిముట్లతో తొలి దశలో 15 నగరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను నిర్మిస్తామని ఉద్ఘాటించారు. తొలి దశలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు విజయవంతమైతే.. మిగిలిన ప్రాంతాలకు విస్తరిస్తామని చెప్పుకొచ్చారు. తానూ రైతు కుటుంబం నుంచే వచ్చానని.. వారి కష్టం తనకు తెలుసునని ప్రస్తావించారు. జగన్ హయాంలో ప్రజలు, నేతలు బయట తిరిగే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఏపీలో ప్రజలందరికీ మరో స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చిన ఘనత ఎన్డీఏదేనని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రతి సమావేశంలో ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజలనే అడుగుతానని అన్నారు. ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేకుంటే.. వారికి మరోసారి సీటు ఇచ్చే ఛాన్స్ ఉండదని స్పష్టం చేశారు. అచ్యుతాపురం, గుంటూరు, కర్నూలు, శ్రీసిటీ, తిరుపతి, అమరావతికి ఈఎస్ఐ ఆస్పత్రులు తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. పోలవరం పూర్తి చేసి కృష్ణా నదితో అనుసంధానిస్తామని వ్యాఖ్యానించారు. డిసెంబర్ నాటికి బందర్ పోర్టు నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ - మచిలీపట్నం హైవే ఎక్స్‌ప్రెస్ రోడ్డుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పోలవరం కోసం కష్టపడి తాము 70 శాతానికి పైగా పనులు పూర్తి చేశామని.. అలాంటి ప్రాజెక్టును నాశనం చేసి.. జగన్ హయాంలో ఆ పనులు నిలిపివేశారని సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు. అమరావతి ప్రజా రాజధాని.. మన మైథాలజీలో దేవతల రాజధాని అని అభివర్ణించారు. అలాంటి అమరావతిని ఎడారి అని, శ్మశానమని మొత్తం నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణం చేస్తుంటే.. వారు విధ్వంసం చేశారని ఫైర్ అయ్యారు. మళ్లీ అలాంటి విధ్వంసకర పాలన అధికారంలోకి రాకూడదని ప్రజలు గుర్తించాలని అన్నారు. నరకాసుడి వధ కారణంగా మనం దీపావళి చేసుకుంటున్నామని.. దుర్మార్గుడు చనిపోయారని.. సమాజం బాగుపడింది.. అంటే అలాంటి వారిని మళ్లీ సమర్థించకూడదని అర్థమని అన్నారు. ప్రతి ఒక్కరూ మీ గుండె మీద చేయి వేసుకుని ఆలోచన చేయాలని కోరారు. తెల్లవారుజామున నిద్ర లేస్తూనే.. సాక్షి టీవీలో మాజీ మంత్రి వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయారని వేశారని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. అయ్యో అనుకున్నాను.. రెండు గంటల తర్వాత ఇదే వారంతా మాట్లాడారని తెలిపారు. వివేకా కూతురు విచారణ చేయాలని, అనుమానం ఉందని కోరితే.. విచారణ చేయించామని అన్నారు. గొడ్డలితో దారుణంగా నరికి చంపినట్లు అధికారుల విచారణలో తేలిందన్నారు. గోడ, బెడ్, బాత్ రూం అంతా రక్తం.. చనిపోయే పరిస్థితిలో ఆయనతో సంతకాలు పెట్టించారని ప్రస్తావించారు. తీరిగ్గా ఆరోజు సాయంత్రం అక్కడకు వచ్చి.. ప్రత్యర్థులు చంపారని మాట్లాడించారని ధ్వజమెత్తారు. అన్న మాటలు నమ్మి... ఆమె కూడా ప్రత్యర్థులపై అనుమానం వ్యక్తం చేశారని అన్నారు. నాన్న లేరు.. చిన్నాన్న లేరని మాట్లాడిన జగన్.. మరుసటి రోజు సాక్షిలో తన చేతిలో గొడ్డలి పెట్టి.. నారాసుర రక్త చరిత్ర అని రాస్తే ప్రజలు నమ్మారని తెలిపారు. 2019లో జగన్ మోసాలు తెలుసుకోకుండా.. ఓట్లు వేసి 151 సీట్లు ఆయనకు ఇచ్చి గెలిపించారని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. జగన్ హయాంలోని ఐదేళ్లు విధ్వంసకర పాలన చేశారని ఆగ్రహించారు. తాను, మోదీ, పవన్ కల్యాణ్ కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తే 94శాతం సీట్లతో గెలిపించారని తెలిపారు. తాను అభివృద్ధి చేయడం.. ఆ తర్వాత ఎవరో వచ్చి నాశనం చేయడం ఇలా అవసరమా అని ప్రశ్నించారు. ప్రజలంతా ఆలోచన చేసి.. మరోసారి ఎన్డీఏకు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.. సుపరి పాలన ఇచ్చే బాధ్యత తమదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ఫామ్‌హౌస్ అడ్డాగా సీఐ చిన్నమల్లయ్య రాసలీలలు.. వెలుగులోకి వీడియో



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఒంటరి మహిళపై అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న సీఐ చిన్న మల్లయ్య రాసలీలలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఇంట్లో ఒంటరిగా ఉన్న తనపై సీఐ చిన్న మల్లయ్య అత్యాచారం చేశాడంటూ వినుకొండ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో సీఐ చిన్న మల్లయ్య మరో మహిళతో ఉన్న వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. చిన్న మల్లయ్య గతంలో వినుకొండలో సీఐగా పని చేశారు. బ్రహ్మణపల్లిలోని ఫామ్‌హౌస్‌లో ఎంతో మంది మహిళలతో ఆయన రాసలీలలు జరిపినట్లు తెలుస్తోంది. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధిత మహిళలను లొంగదీసుకుని వారిని ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లే వాడన్న ప్రచారం జోరుగా సాగుతోంది. చిన్న మల్లయ్య ప్రస్తుతం పరారీలో ఉన్నారు. పోలీసులు ఆయన కోసం గాలిస్తున్నారు. వినుకొండ పట్టణ సీఐ ప్రభాకర్.. ఫోరెన్సిక్ నిపుణులతో నిన్న (గురువారం) సీఐ చిన్న మల్లయ్యతో పాటు బాధిత మహిళ ఇళ్ల వద్దకు వెళ్లారు. ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు. పోలీసులు బాధిత మహిళను చిలకలూరిపేటలోని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచి, స్టేట్‌మెంట్ రికార్డు చేశారు.

# జలశక్తి శాఖ కార్యదర్శితో ఏపీ అధికారుల భేటీ.. పోలవరంపై కేంద్రం కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్ట్‌పై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. 2027 జూన్ నాటికి పోలవరం పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్ట్‌కు మరో రూ.3,300 కోట్ల నిధులు మంజూరు చేసేందుకు కేంద్రం అంగీకరించింది. ఇటీవల ఈ ప్రాజెక్ట్‌కు రూ.2,300 కోట్లు కేంద్రం విడుదల చేసిన సంగతి తెలిసిందే. వచ్చే సెప్టెంబర్ నాటికి మరో రూ. 3,300 కోట్ల విడుదల చేసేందుకు కేంద్రం అంగీకరించినట్లు సమాచారం. శుక్రవారం న్యూఢిల్లీలో జలశక్తి శాఖ కార్యదర్శి కాంతారావుతో ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, జల వనరుల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావుతోపాటు పలువురు ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్ట్‌పై కీలక చర్చ జరిగింది. వేగంగా ప్రాజెక్ట్ నిర్మాణం, పునరావాస కార్యక్రమాలు పూర్తి చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అలాగే ఎగువ రాష్ట్రాల అభ్యంతరాలు, ఆయా రాష్ట్రాల్లో ముంపు ప్రభావం, అక్కడ చేపట్టాల్సిన చర్యలతోపాటు ఆ రాష్ట్రాలతో సమన్వయం తదితర అంశాలపై ఏపీ అధికారులతో జలశక్తి శాఖ కార్యదర్శి కాంతారావు చర్చించారు. ప్రాజక్ట్ 45.72 మీటర్లతో 194.6 టీఎంసీల పూర్తి స్థాయి నీటి సామర్థ్యంతో నిర్మాణంపై తదుపరి కార్యాచరణను కార్యదర్శి కాంతారావు నిర్దేశించారు. ఇక రెండో దశ భూసేకరణ పునరావాస ప్యాకేజీ అమలుకు సంబంధించిన కార్యాచరణపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. ఇటీవల పోలవరం ప్రాజక్ట్, ముంపు ప్రాంతాల్లో కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి కాంతారావు పర్యటించారు. ప్రాజక్ట్ పనులు, ముంపు ప్రాంతాల్లో చేపట్టిన పునరావాస కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయన స్వయంగా పర్యవేక్షించారు.

# అమెరికాలో విషాదం.. ఉద్యోగం రాదేమోనని కర్నూలు యువకుడి ఆత్మహత్య



**న్యూయార్క్:** అమెరికాలో విషాదం చోటు చేసుకుంది. ఉద్యోగం రాదేమోనన్న భయంతో కర్నూలుకు చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గదిలో తుపాకితో కాల్చుకుని ప్రాణాలు తీసుకున్నాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలలోకి వెళితే.. కర్నూలుకు చెందిన 26 ఏళ్ల ఇరగనబోయిన చందు.. అమెరికా, షికాగోలోని డీపాల్ యూనివర్సిటీలో ఎంఎస్ చదివాడు. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. అయితే, అమెరికాలో మారిన పరిస్థితుల కారణంగా ఉద్యోగం రావటం కష్టంగా మారింది. అవసరాల కోసం కుటుంబ సభ్యులపై ఆధారపడాల్సి వస్తోంది. ఎంత ప్రయత్నించినా ఉద్యోగం రాకపోవటం.. ఖర్చుల కోసం కుటుంబ సభ్యుల మీద ఆధారపడాల్సి రావటంతో చందు మనస్తాపం చెందాడు. ఒత్తిడి తట్టుకోలేక ఏప్రిల్ 28వ తేదీన అపార్ట్‌మెంట్ గదిలో తుపాకితో కాల్చుకుని ప్రాణాలు తీసుకున్నాడు. చందు మరణ వార్త తెలిసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తానా టీం స్క్వేర్ కోఛైర్ చిరంజీవి గల్లా.. చందు మృతదేహాన్ని కర్నూలు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# కీలకమైన శాఖలో సమర్థవంతమైన ఉద్యోగి వి.వి.ప్రసాద్

### - మీడియా సమన్వయంలో ప్రసాద్‌ది తనదైన ముద్ర - ప్రసాద్ సేవలు మరికొంత కాలం అవసరం : జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ





**విజయవాడ, (రాజధాని వార్తలు):** అత్యంత కీలకమైన సమాచార పౌర సంబంధాల శాఖలో వి.వి.ప్రసాద్ సమర్థవంతమైన సేవలతో వృత్తికి వన్నె తెచ్చారని ఆయన సేవలు మరికొంత కాలం అవసరమని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అన్నారు. సమాచార పౌరసంబంధాల శాఖ జిల్లా పౌర సంబంధాల కార్యాలయంలో ఎ.వి.సూపర్ వైజర్ గా పనిచేసి పదవీ విరమణ చేసిన వి.వి. ప్రసాద్ మీడియా ప్రతినిధుల ఆత్మీయ కలయిక కార్యక్రమం శుక్రవారం నగరంలోని హనుమాన్ పేటనందు గల ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ మాట్లాడుతూ మీడియాను సమన్వయం చేయటం కీలకమైన అంశం అన్నారు. వి.వి.ప్రసాద్ ప్రభుత్వ కార్యక్రమాలలో ఎటువంటి సమస్యలు రాకుండా మీడియాను చాలా అద్భుతంగా సమన్వయం చేశారని అభినందించారు. తన 13 ఏళ్ల సర్వీసులో వి.వి.ప్రసాద్ వంటి ఉత్తమ కోఆర్డినేటర్‌ను ఎక్కడా చూడలేదని, తన టీం ఎన్‌టిఆర్‌లో ఒక ప్రధానమైన ఎసెట్ అని అన్నారు. సమర్థవంతమైన సేవలందిస్తున్న ప్రసాద్ పదవీ విరమణ పొందడం తనకు ఇష్టం లేదని, ఆయన సేవలు జిల్లాకు ఇంకా అవసరమన్నారు. అందుకే ఆయనను తిరిగి నియమించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వృత్తిపరంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా వి.వి.ప్రసాద్ చాలా మంచి మనిషి అన్ని తనకు కుటుంబ సభ్యుడులాంటి వాడని అన్నారు. ఆయన తిరిగి పునర్ నియామకం జరిగేలా అవసరమైన చర్యలు సమాచార శాఖ అధికారులు తీసుకోవాలని కోరారు. ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని అనంతరం కుటుంబ సభ్యులతో అనందమైన జీవితం, ఆరోగ్యం సంతోషంగా ఉండాలని కలెక్టర్ డా.జి.లక్ష్మీశ ఆకాంక్షించారు. సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సమాచార శాఖలో సమర్థవంతమైన సేవలందిస్తున్న వారిలో వి.వి. ప్రసాద్ ఒకరని అన్నారు. ఉద్యోగ ప్రస్థానం సినీ అపరేటర్‌గా ప్రారంభమైనప్పటికి ఫోటోగ్రాఫర్‌గా పిఆర్‌వోగా మీడియా సమన్వకర్తగా అసమానమైన సేవలందించి మంచి గుర్తింపు పొందన్నారు. జాయింట్ డైరెక్టర్ ఐ.సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఉద్యోగ పరంగా సేవలందించడంతో పాటు ప్రతి ఒక్కరికి వ్యక్తిగతమైన సేవలు అందించడంతో వి.వి.ప్రసాద్ తనదైన ముద్ర వేసుకున్నారని ఆయనకు అప్పగించిన ఎటువంటి క్లిష్టతరమైన పనినైన అత్యంత చాకచక్యంతో సులువుగా పూర్తి చేసి అధికారులతో శభాష్ అనిపించుకునేవారు. జాయింట్ డైరెక్టర్ టి.కసూరి మాట్లాడుతూ సమాచార శాఖ ఉద్యోగులలో వి.వి. ప్రసాద్‌కు మంచి గుర్తింపు ఉందని ఆయనపనితీరు ఆదర్శవంతంగా తీసుకోవాలని ముఖ్యంగా మీడియా ప్రతినిధులతో ఉద్యోగిగా కాకుండా కుటుంబ సభ్యుని వలే ఆదరాభిమానాలు పొందరన్నారు. పదవీ విరమణ పొందిన వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ 29 ఏళ్ళుగా విజయవాడలో సమాచార శాఖ ద్వారా మీడియా మిత్రులకు సేవలందించే భాగ్యం కల్పించినందుకు ఆయన భగవంతుడికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. 1997లో అప్పటి జిల్లా కలెక్టర్ చిత్ర రామచంద్రన్ కాలం నుండి ప్రస్తుత జిల్లా డా.జి.కలెక్టర్ లక్ష్మీశ వరకు అందరు కలెక్టర్ల వద్ద పని చేయడం తన అదృష్టమని పేర్కొన్నారు. ప్రస్తుత జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తన పనితీరును మెచ్చి, తనను తిరిగి నియామకం చేసేలా ప్రభుత్వానికి రాసిన సిఫార్సు లేఖను తన జీవితంలో అతిపెద్ద అవార్డుగా భావిస్తున్నానని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. తన పదవీ కాలంలో మీడియా మిత్రులు తనను ఒక కుటుంబ సభ్యునిలా, "ప్రసాద్ అన్న" అని పిలుస్తూ ఆదరించారని తాను పదవిలో ఉన్నా లేకపోయినా, ప్రాణం ఉన్నంత వరకు సమాచార శాఖకు, మీడియా మిత్రులకు తనవంతు సేవలు అందిస్తూనే ఉంటానని వి.వి.ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు ఎస్.వి. మోహనరావు, పి.రాజశేఖర్, కె.నారాయణరెడ్డి, ఎవిఎస్ వీరభద్రరావు, డిఐపిఆర్‌వో కె.వి.రమణరావు, పిఆర్‌వో జి. రాంబాబు, పింట్, ఎలక్ట్రానిక్ సోషల్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీలో ఘనంగా మేడే ఉత్సవాలు నిర్వహించిన ఇ.యు

### - రాష్ట్ర వ్యాప్తంగా 129 డిపోలు, నాలుగు వర్క్ షాప్‌ల వద్ద ఎర్ర జెండా ఎగుర వేసిన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు - విజయవాడ డిపో, పాత బస్సు స్టాండ్‌నందు పాల్గొన్న ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు




**విజయవాడ, (రాజధాని వార్తలు):** తేది:01.05.2026 ప్రపంచ కార్మిక దినోత్సవము (మేడే) ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 129 డిపోలు, నాలుగు వర్క్ షాప్‌ల వద్ద యూనియన్ జండాను ఆవిష్కరణ చేసి ఘనంగా మేడే ఉత్సవాలను నిర్వహించడం జరిగింది. మేడే సందర్భంగా విజయవాడ డిపో వద్ద, గవర్నర్ పేట-1&2 డిపోల పరిధిలో పాతబస్టాండ్ నందు జరిగిన కార్యక్రమములలో రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య పాల్గొని ఉద్యోగులు అందరికి మేడే శుభాకాంక్షలు తెలియజేసారు. ఆర్టీసీ పరిరక్షణ కొరకు ముఖ్యముగా ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వ సహకారముతో ఆర్టీసీనే నడపాలని, ఎలక్ట్రికల్ బస్సులను ప్రవేటు వారికి అప్పగిస్తూ డిపోలను ఖాళీ చేయించే చర్యలను మానుకోవాలని లేదంటే భవిష్యత్‌లో ఆర్టీసీలో బలమైన ఆందోళనలను నిర్మిస్తామని తెలిపారు. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం నుండి చెల్లించాల్సిన బకాయిలను, ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన డిఏ అరియర్స్, కొత్త డిఏలు, పియార్సీ కమిషనర్‌ను నియమించి ఐఆర్ ప్రకటించి ఉద్యోగులలో తీవ్రమైన ఆశాంతిని తొలగించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎమ్.శంకరరావు, యస్.కె.మొహిద్దీన్, జి.యస్.నారాయణ, యస్.యస్.నారాయణ, ఎన్.హెచ్.ఎన్.చక్రవర్తి, జోనల్ కార్యదర్శి వై.యస్.రావు, జిల్లా అధ్యక్షులు ఎ.కె.సాగర్, జిల్లా కార్యదర్శి జి.ఎమ్.రావు డిపో నాయకులు అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

# అలర్ట్..నేడుఫోన్లలో బీప్ సౌండ్ వస్తే కంగారు పడకండి.. ఎందుకంటే?

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతంలోని మొబైల్ వినియోగదారులకు శనివారం ఒక ముఖ్యమైన సూచన. ఉదయం 11:15 గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల మధ్య మీ మొబైల్ ఫోన్లకు ఒక ప్రత్యేకమైన 'టెస్ట్ అలర్ట్' సందేశం రానుంది. ఈ సందేశం వచ్చే సమయంలో మీ ఫోన్ పెద్దగా బీప్ శబ్దం చేయడంతో పాటు వైబ్రేషన్‌కు గురవుతుంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సమన్వయంతో, ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఈ పరీక్షను నిర్వహిస్తోంది. ఫోన్ స్క్రీన్‌పై వచ్చే సందేశాన్ని చదువుకోవాలని, అయితే దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా అత్యవసర హెచ్చరికల వ్యవస్థను మరింత బలోపేతం చేసే చర్యల్లో భాగంగా ఈ ప్రయోగాత్మక పరీక్షను నిర్వహిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు (వరదలు, తుపాన్లు) లేదా ఇతర అత్యవసర పరిస్థితులు సంభవించినప్పుడు, అతి తక్కువ సమయంలో లక్షలాది మందికి సమాచారాన్ని చేరవేయడం. ఈ వ్యవస్థ ద్వారా నెట్‌వర్క్ జాప్యం లేకుండా నేరుగా వినియోగదారుల మొబైల్ స్క్రీన్‌పైకి హెచ్చరికలను పంపవచ్చు. ఇది కేవలం ఒక సాంకేతిక పరీక్ష మాత్రమే.




మొబైల్ నుంచి వచ్చే శబ్దాలు లేదా సందేశాలు చూసి భయపడకండి. ఈ అలర్ట్ వచ్చినప్పుడు మీరు ఎటువంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదు. ఈ అధునాతన హెచ్చరిక వ్యవస్థ భవిష్యత్తులో ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు వెల్లడించారు. కాబట్టి శనివారం ఉదయం మీ ఫోన్ మోగితే అది మీ రక్షణ కోసం జరుగుతున్న పరీక్షగా భావించండి అని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.






**కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గం పమిడిముక్కలలో పేదల సేవలో, మేడే కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. మేడే సందర్భంగా ఉత్తమ కార్మికులు, పరిశ్రమల యాజమాన్యాలకు పురస్కారాలు అందించి సత్కరించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఎం చంద్రబాబు ప్రసంగించారు.**

# వైభవంగా బాలా త్రిపురీ శ్రీముఖలింగేశ్వర స్వామి వారి నూతన ప్రతిష్టా మహా కుంభాభిషేక మహోత్సవం

### - రాష్ట్రంలో దేవాలయాలకు పూర్వ వైభవం తీసుకు రావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం - కుటుంబ సమేతంగా హాజరై మంత్రి కొలుసు పార్థసారథి ప్రత్యేక పూజలు - హాజరైన మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ బాలశౌరి, ఇతర ప్రజాప్రతినిధులు, గృహనిర్మాణ, సమాచార మరియు పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి





**మొవ్వ/పామర్రు, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలోని హిందూ దేవాలయాలకు పునర్ వైభవం తీసుకువచ్చి దూప, దీప నైవేద్యాలతో, ఆధ్యాత్మికతతో కళకళలాడే విధంగా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. కృష్ణా జిల్లా మొవ్వ మండలం కారకంపాడు గ్రామంలో బాలా త్రిపురీ శ్రీముఖలింగేశ్వర స్వామి వారి నూతన విగ్రహం, ధ్వజ స్థంభ ప్రతిష్ట, మహా కుంభాభిషేక మహోత్సవాన్ని శుక్రవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించామని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మంత్రి పార్థసారథి సతీసమేతంగా కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రివర్యులకు వేద పండితులు 'పూర్ణకుంభం'తో ఘనస్వాగతం పలికారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రవేశం చేసిన మంత్రి, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హోమం, ప్రతిష్టాపన పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు మంత్రి దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, వేద ఆశీర్వచనాలు పలికారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం భక్తజన సందోహం మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించబడిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ... రాష్ట్రంలోని ప్రతి ఆలయాలయాలకు పూర్వ వైభవం తీసుకువచ్చి.. ధూప, దీప, నైవేద్యాలతో కళకళలాడేలా, ఆధ్యాత్మికతతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నార చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న సేవలు మరింత విస్తరించేలా ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించినప్పుడే ప్రభుత్వానికి గుర్తింపు లభిస్తుందని, ఆలయాలు భారతీయ జీవన విధానానికి ప్రతీకలని అన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ దేవస్థానం ఈ ప్రాంతంలోనే స్థానికంగా ఒక ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు ఆయు:రారోగ్యాలతో, పాడిపంటలతో సస్యశ్యామలంగా ఉండాలని సంకల్పించి ఈ రాజశ్యామల యజ్ఞయం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు.

**మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ కోసం ప్రత్యేకంగా పూజలు:**

మంత్రి నారా లోకేష్ పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా, రాష్ట్ర ప్రగతికి ఆయన చేస్తున్న కృషి మరింత సఫలం కావాలని కోరుతూ రాజశ్యామల యాగం నిర్వహించామన్నారు. భవిష్యత్‌లో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి రాష్ట్రానికి మరిన్ని సేవలు అందించేలా ప్రత్యేక పూజలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్, రాష్ట్ర గౌడ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, తదితరులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కారకంపాడు పరిసర గ్రామాల భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

# 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో నవోదయ విద్యార్థుల విజయకేతనం











**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** గురువారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నాయుడుపేట పట్టణంలోని నవో దయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు నూరు శాతం అత్యుత్తమ ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను కరస్పాండెంట్ పద్మనాభరెడ్డి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థుల పరీక్షా ఫలితాల వివరాలను తెలియజేశారు. తమ పాఠశాల నుండి పదవ తరగతి పరీక్షలకు హాజరైన 63 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో నూరు శాతం ఫలితాలు సాధించారని తెలియజేశారు. బి గురు చరణ్ రెడ్డి 600 మార్కులకు గాను 586 మార్కులు సాధించి పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. ఎం గుహని 583 మార్కులు, ఎండి ముష్కాన్ మీర్జా 582 మార్కులు, ఎన్ హిందూజా 582 మార్కులు, కె హర్షిత 582 మార్కులు సాధించాలని తెలియజేశారు. గత 40 ఏళ్లుగా పాఠశాల స్థాపించిన నాటి నుండి నేటి వరకు తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో నూరు శాతం ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. తమ పాఠశాలలో చదివిన అనేకమంది విద్యార్థులు ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారని తెలిపారు. అంకితభావంతో క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు సిబ్బందికి, విద్యార్థులను ప్రోత్సహిస్తున్న వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్ హిందూజా 582 మార్కులు, కె హర్షిత 582 మార్కులు సాధించాలని తెలియజేశారు. గత 40 ఏళ్లుగా పాఠశాల స్థాపించిన నాటి నుండి నేటి వరకు తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో నూరు శాతం ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. తమ పాఠశాలలో చదివిన అనేక మంది విద్యార్థులు ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారని తెలిపారు. అంకితభావంతో క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు సిబ్బందికి, విద్యార్థులను ప్రోత్సహిస్తున్న వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# బుద్ధ పూర్ణిమ – కరుణా పరిపూర్ణత



చిత్ర పూర్ణిమ పవిత్ర పర్వదినం సందర్భంగా, ఆలయాల్లో వేడుకలు జరుగుతున్న ఈ శుభవేళ, ప్రతి ఇంటా సుఖసంతోషాలు, సిరిసంపదలు వర్ధిల్లాలని కోరుకుంటున్నాను. ఈ సందర్భంగా నా సోదర సోదరీమణులందరికీ బుద్ధ పూర్ణిమ శుభాకాంక్షలు తెలియజేయడం నాకు ఎంతో సంతోషాన్నిస్తోంది. ప్రపంచానికి భారతదేశం అందించిన ఎన్నో గొప్ప కానుకల్లో బౌద్ధం అత్యంత ప్రధానమైనది. గౌతమ బుద్ధుని జీవితం, ఆయన బోధనలు నేటికీ ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. నిజమైన ఆత్మ సాక్షాత్కారం ఎంత ముఖ్యమో భారతదేశం ప్రపంచానికి చాటి చెప్పింది. “బుద్ధుడు” అంటేనే “మేల్కొన్నవాడు” అని అర్థం. మానవాళిని చైతన్యం వైపు నడిపించేందుకు కృషి చేసిన ఆ మహాత్ముని జననం, జ్ఞానోదయం ఒకే రోజున సంభవించడం విశేషం. రాకుమారుడు సిద్ధార్థ సకల రాజభోగాల మధ్య పెరిగారు. కానీ, తన 29వ ఏట రాజప్రాసాదాన్ని, భార్యాబిడ్డలను, సమస్త సంపదలను వదిలి ఆధ్యాత్మిక సత్యం కోసం బయలుదేరారు. ఆరేళ్ల కఠిన శ్రమ, అన్వేషణ తర్వాత బుద్ధగయలోని బోధి వృక్షం కింద ఆయనకు జ్ఞానోదయం కలిగింది. అలా సిద్ధార్థుడు ‘బుద్ధుడిగా’ మారారు. ఆయన కనుగొన్న నాలుగు ఆర్య సత్యాలు, నైతిక ప్రవర్తనతో కూడిన జీవన మార్గం ఒక సరికొత్త జీవన తత్వానికి పునాది వేశాయి. ఇది ప్రపంచ చరిత్రలో భారతదేశానికి ఒక ప్రత్యేక గుర్తింపును, గర్వకారణాన్ని తెచ్చిపెట్టింది. వారణాసి సమీపంలోని సారనాథ్‌లో బుద్ధుడు తన ఐదుగురు శిష్యులకు (సన్యాసులకు) మొదటి బోధన చేశారు. దీనినే “ధర్మచక్ర పరివర్తన” అంటారు. ఈ బోధనే బౌద్ధమతానికి పునాదిగా మారి, ప్రపంచ వ్యాప్తంగా ఈ ధర్మం విస్తరించడానికి నాంది పలికింది. కాలక్రమేణా, బుద్ధుని బోధనలకు ఆకర్షితులై ఎంతోమంది ఆయన వైపు మళ్లారు. మగధ రాజైన బింబిసారుడు రాజగీర్‌లోని ‘వేణువనం’ అనే మఠాన్ని దానంగా ఇచ్చారు. అలాగే, అనాథపిండికుడు అనే సంపన్న వ్యాపారి ‘జేతవనం’ అనే తోటను కొనుగోలు చేయడానికి, ఆ నేల మొత్తాన్ని బంగారు నాణేలతో పరిచి మరీ ఆశ్రమాన్ని నిర్మించారు. ఇవన్నీ ఆనాడు భారతదేశంలో ధర్మం పట్ల ప్రజలకు ఉన్న ప్రగాఢ విశ్వాసానికి నిదర్శనాలు. ఈ మఠాలు బుద్ధుడు బోధించిన నాలుగు ఆర్య సత్యాలను విస్తృతంగా ప్రచారం చేశాయి: కోరికలే దుఃఖానికి మూలకారణం, కోరికలను తొలగించడం ద్వారానే దుఃఖాన్ని జయించవచ్చు, అష్టాంగ మార్గాన్ని అనుసరించడం ద్వారా దుఃఖం లేని విముక్త జీవితాన్ని గడపవచ్చు అలాగే.. బుద్ధుడు ఇలా హితవు పలికారు: గతంలో కూరుకుపోవద్దు–ప్రస్తుతంలో జీవించు. సత్యం చాలా శక్తివంతమైనది. మనసే అన్ని పనులకు మూలస్థానం, అందుకే ఎప్పుడూ సానుకూల ఆలోచనలనే పెంచుకో. కష్టకాలంలో భయపడి వెనుకడుగు వేయవద్దు. జీవిత ప్రయాణం చివరకు ఒంటరిదే–దానిని ఆధ్యాత్మిక మార్గంలో నడిపించు. మాటలు గాయపరుస్తాయి, అందుకే మృదువుగా మాట్లాడు. ప్రేమ, అహింస అనేవి జీవితానికి అత్యంత అవసరం. నేర్చుకోవడం ఎప్పుడూ ఆపకు–నిరంతరం నేర్చుకుంటూనే ఉండు. మణిమేఖలై, కుండలకేసి వంటి తమిళ సాహిత్య గ్రంథాలు బౌద్ధ తత్వాన్ని ఎంతో అందంగా చాటిచెప్పాయి. అనేక గ్రంథాలు కాలగర్భంలో కలిసిపోయినప్పటికీ, అవి అందించిన జ్ఞానం మాత్రం వెలకట్టలేనిది. “మతిని మసకబార్చే మత్తు పానీయాలు, ప్రాణాలను తీయడం వంటి పనులను... మోహం లేని విజ్ఞులు ఎప్పుడో వదిలిపెట్టారు, వినండి: జనన మరణాలు, మళ్లీ మరణం తర్వాత జన్మించడం అనేవి కేవలం నిద్రపోవడం, మేల్కొనడం వంటివి–ఇదే సత్యం. పుణ్యకార్యాలు చేసేవారు ఉన్నతమైన లోకాన్ని పొందుతారు, చెడు పనులు చేసేవారు తీవ్రమైన దుఃఖంలో కూరుకుపోతారు. ఈ నిజాన్ని గ్రహించి, విజ్ఞులైన వారు తమ బంధాలను తెంచుకున్నారు.” తమిళ మహాకావ్యం మణిమేఖలై (ఆత్తిరై పిచ్చైయిట్ట కాదై: 84–90) బౌద్ధ ధర్మం యొక్క సారాంశాన్ని ఈ విధంగా ఎంతో అర్థవంతంగా వివరించింది.

He emphasized five moral precepts: non-violence, non-stealing, refraining from adultery, truthfulness, and abstaining from intoxicants. Beyond religion, he taught that the mind is the root of everything-positive thoughts and actions lead to a harmonious life and society. Because he brought clarity and enlightenment to troubled minds, he is celebrated as the ‘Light of Asia.’

బుద్ధుడు ఐదు ముఖ్యమైన నైతిక సూత్రాలను (పంచశీల) బోధించారు : అవి అహింస, దొంగతనం చేయకపోవడం, వ్యభిచారానికి దూరంగా ఉండటం, సత్యం పలకడం మరియు మత్తు పానీయాలకు దూరంగా ఉండటం. మతానికి అతీతంగా, మనసే అన్నింటికీ మూలమని ఆయన బోధించారు–సానుకూల ఆలోచనలు, పనులే ప్రశాంతమైన జీవితానికి, సామరస్యపూర్వకమైన సమాజానికి దారితీస్తాయని చెప్పారు. కలత చెందిన మనసులకు స్పష్టతను, జ్ఞానోదయాన్ని అందించినందుకే ఆయనను “లైట్ ఆఫ్ ఆసియా”గా కొనియాడతారు. ప్రధాని నరేంద్ర మోదీ ‘మన్ కీ బాత్’ కార్యక్రమంలో చెప్పిన మాటలు ఈ సందర్భంగా నాకు గుర్తున్నాయి: “భగవాన్ గౌతమ బుద్ధుని జీవిత సందేశం నేటికీ ఎంతో సందర్భోచితంగా ఉంది. శాంతి అనేది మన నుంచే మొదలవుతుందని ఆయన మనకు నేర్పారు; తనను తాను జయించడమే అన్నిటికంటే గొప్ప విజయమని మనకు గుర్తు చేశారు. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న ఉద్రిక్తతలు, ఘర్షణల మధ్య బుద్ధుని బోధనలు మరింత ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.” బుద్ధుని బోధనలకు ఉన్న మార్చే శక్తి ఎంతటిదో చక్రవర్తి అశోకుని జీవితమే ఒక నిదర్శనం. యుద్ధమే పరమావధిగా బతికే పాలకుడిని శాంతి కాముకుడిగా ఈ బోధనలే మార్చేశాయి. అశోక చక్రవర్తి దేశవ్యాప్తంగా శాసనాలు, స్తూపాలను నిర్మించి బౌద్ధ సూత్రాలను ప్రచారం చేశారు. సాంచి, సారనాథ్‌లోని స్తూపాలు నేటికీ ప్రపంచ నలుమూలల నుంచి ప్రజలను ఆకర్షిస్తున్నాయి. సారనాథ్ లోని ‘సింహ తలల స్తంభం’ ప్రస్తుతం మన భారత జాతీయ చిహ్నంగా గౌరవించబడుతోంది. అశోకుడు తన కుటుంబ సభ్యులతో పాటు బౌద్ధ సన్యాసులను ఆసియా అంతటా పంపి బౌద్ధాన్ని వ్యాపింపజేశారు. ‘మహావంశం’ గ్రంథంలో పేర్కొన్నట్లుగా, ఆయన కుమారుడు మహేంద్రుడు శ్రీలంకకు వెళ్లి బుద్ధుని బోధనలను ప్రచారం చేశారు. బౌద్ధ సన్యాసుల కృషి వల్ల తమిళనాడులో కూడా ఈ ధర్మం విస్తరించిందని భావిస్తారు; దీనికి నిదర్శనంగా ఇప్పటికీ ఆ ప్రాంతాల్లో అనేక బౌద్ధ ఆనవాళ్లు కనిపిస్తాయి. బౌద్ధ సన్యాసులు ఎటువంటి వివక్ష లేకుండా అందరికీ ఉచిత వైద్య సేవలను, విద్యను అందించారు. వారు త్రిపిటక వంటి పవిత్ర గ్రంథాలను బోధించడంతో పాటు, జాతక కథలను ప్రజలకు వివరించేవారు. అంతేకాకుండా, ప్రజల్లో చైతన్యాన్ని నింపడానికి ధ్యాన ప్రక్రియలలో వారికి మార్గనిర్దేశం చేసేవారు. దానధర్మం, ముఖ్యంగా పేదలకు అన్నదానం చేయడం అనేది ఒక ప్రాథమిక విధిగా పరిగణించబడేది. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం అంటే వారికి ప్రాణదానం చేయడమేనని తమిళ సాహిత్యం చాటి చెప్పింది. వేల సంవత్సరాలుగా, ఈ గడ్డపై ఎన్నో రకాల ఆధ్యాత్మిక చింతనలు, విభిన్న తత్వాలు విరాజిల్లాయి, అభివృద్ధి చెందాయి. అది బౌద్ధమైనా లేదా జైనమైనా... ఏ మతాన్నైనా భారతదేశం అంతటా ఒకే స్ఫూర్తితో స్వీకరించారు. ఇది మన దేశం సాంస్కృతిక పరంగా, భావాల పరంగా ఎప్పుడూ ఏకతాటిపైనే ఉందని నిరూపిస్తుంది. నిరంతర అభ్యాసానికి ప్రాధాన్యతనిచ్చే బౌద్ధం, విద్యా సంస్థలను, గ్రంథాలయాలను భారీ స్థాయిలో స్థాపించింది. 5వ శతాబ్దం నాటికే నలంద విశ్వవిద్యాలయం సుమారు 10,000 మంది విద్యార్థులు, 1,500 మంది ఉపాధ్యాయులతో ఒక గొప్ప విద్యా కేంద్రంగా విరాజిల్లింది. నలంద తరహాలోనే, తమిళనాడులోని కాంచీపురంలో కూడా ఒక ప్రసిద్ధ విశ్వవిద్యాలయం ఉండేదని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. విక్రమశిల, ఓదంతపురి వంటి విశ్వవిద్యాలయాలతో పాటు, అప్పట్లో వెలువడిన అనేక సాహిత్య గ్రంథాలు మన దేశ మేధో సంపత్తిని ప్రపంచానికి చాటి చెప్పాయి. ఆసియా నలుమూలల నుంచి పండితులు ఈ బౌద్ధ పాఠశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుకోవడానికి వచ్చేవారు. చైనా యాత్రికుడు ఫాహియాన్ తన 15 ఏళ్ల సుదీర్ఘ తీర్థయాత్రను ప్రత్యేకంగా బౌద్ధం కోసమే చేపట్టారు. మరో చైనా యాత్రికుడు హువాన్‌త్సాంగ్ కూడా 16 ఏళ్ల పాటు భారతదేశంలో ఉండి, నలందలో విద్యాభ్యాసం చేసి, అనేక బౌద్ధ గ్రంథాలను సేకరించి తన దేశానికి తిరిగి వెళ్లారు. హువాన్‌త్సాంగ్ తన వివరణాత్మక యాత్రా కథనాల్లో పేర్కొన్న ప్రకారం.. ఆయన తమిళనాడులోని కాంచీపురాన్ని కూడా సందర్శించారు. అక్కడ ఒక బౌద్ధ విశ్వవిద్యాలయంలో ఉండి విద్యాభ్యాసం చేయడమే కాకుండా, తాళపత్ర గ్రంథాలను నకలు చేసుకున్నారు. అక్కడి విద్యార్థులకు ఆయన ప్రత్యేక ఉపన్యాసాలు కూడా ఇచ్చారని చెబుతుంటారు. కఠినమైన తపస్సు వల్ల నీరసించిపోయిన బుద్ధునిపై జాలితో, సుజాత అనే మహిళ ఎంతో ప్రేమతో ఆయనకు పాలు, అన్నంతో చేసిన పరమాన్నాన్ని (పాయసం) తినిపించింది. ఇది బుద్ధునికి ప్రాణదానం చేయడమే కాకుండా, బోధి వృక్షం కింద ధ్యానం చేయడానికి అవసరమైన శక్తిని అందించింది. అందుకే బుద్ధ పూర్ణిమ రోజున ఆమె ప్రేమను, కరుణను స్మరించుకుంటూ పాయసాన్ని నైవేద్యంగా సమర్పించడం ఒక ఆచారంగా వస్తోంది. ప్రేమే సంతోషానికి మూలం, ప్రేమే ప్రపంచానికి వెలుగు, ప్రేమే అత్యంత గొప్ప శక్తి”–బుద్ధుడి ఈ బోధనలు నేటికీ ఎంతో సందర్భోచితంగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రేమానురాగాలు, శాంతి సౌభాగ్యాలు వర్ధిల్లాలని నేను మన స్ఫూర్తిగా కోరుకుంటున్నాను.


**రచయిత: శ్రీ సీపీ రాధాకృష్ణన్, భారత ఉపరాష్ట్రపతి**

# ఘనంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం - కళాకారుల అద్భుత ప్రదర్శన














**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. స్థానిక నాట్య గురువులు మరియు శిష్యుల సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 25 కళా సంఘాల అధ్యక్షులు అమరావతి కృష్ణారెడ్డి హాజరై కళాకారుల అద్భుత ప్రదర్శనని వీక్షించారు. ఈ సందర్భంగా అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ నెల్లూరులోని కళాకారుల ప్రతిభను చాటిచెప్పేలా అంతర్జాతీయ నృత్య దినోత్సవం నిర్వహించబడింది. ఈ రోజు మనం ఇక్కడ సాక్షాత్తూ దేవతలు భూమి మీద నాట్యం చేస్తున్నారా అన్నట్లుగా ఉంది. ప్రతి ఒక్కరు చాలా అద్భుతంగా ప్రదర్శించారు. గంటా రెండు నిమిషాల పాటు నిర్విరామంగా సాగిన ఈ ప్రదర్శన గిన్నిస్ రికార్డ్ సాధించే స్థాయికి ఉంది అని కొనియాడారు అనంతరం నాట్య గురువు డేగల సాంబశివరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమ విజయానికి అమరావతి కృష్ణారెడ్డి అందించిన సహకారం వెలకట్టలేనిదని నిర్వాహకులు పేర్కొన్నారు. “మాకు తెలిసింది కేవలం డాన్స్ నేర్పించడం మాత్రమే. ఈ రోజు సుమారు 600 మందికి టిఫిన్ ఏర్పాటు చేయడం నుండి, కార్యక్రమ నిర్వహణ వరకు కృష్ణారెడ్డి అండగా నిలబడ్డారు. ఇంత మందిని ఒకే వేదికపైకి తీసుకు రావడం ఆయన సహకారం వల్లే సాధ్యమైంది అని పేర్కొన్నారు.

# సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశాం

## - నెల్లూరు జిల్లాలో జరగనున్న మహానాడును విజయవంతం చేయండి
## - త్వరలోనే కొత్త పెన్షన్లు, ఇళ్ల పట్టాలు : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి





**కొడవలూరు, (రాజధాని వార్తలు):** కొడవలూరు మండలంలోని తాటాకుల దిన్నె గ్రామంలో 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డును కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో గత 30 ఏళ్లుగా స్మశానానికి సరైన దారి లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి 5 లక్షల ఎంపీ లార్డ్స్ నిధులతో స్మశాన వాటికకు వెళ్లే రహదారిని నిర్మించినట్లు ఆమె తెలిపారు. త్వరలోనే ఈ మార్గాన్ని పూర్తిస్థాయి సిసి రోడ్డుగా మారుస్తామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హామీ ఇచ్చారు. స్మశానానికి దారి కోసం స్థలాన్ని కేటాయించిన స్థల దాత ఉయ్యాల దేశయ్యను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. గ్రామ పర్యటనలో భాగంగా ఎస్సీ కాలనీ ప్రజల విన్నపాన్ని మన్నిస్తూ త్వరలోనే అక్కడ వాటర్ ట్యాంక్ మంజూరు చేయిస్తామని గ్రామంలో అవసరమైన మరిన్ని రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని చెబుతూ.. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని ఆమె కొనియాడారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీతో పాటు, మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే స్త్రీ శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని ప్రజలకు వివరించారు. అర్హులైన వారందరికీ త్వరలోనే కొత్త రేషన్ కార్డులు, ఇళ్ల పట్టాలు అందజేస్తామన్నారు. నెల్లూరు జిల్లాలో జరగనున్న తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడులో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు మండలం తెలుగుదేశం, జనసేన, బిజెపి ముఖ్య నాయకులతో పాటు కార్యకర్తలు మరియు అధికారులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యకేంద్ర విద్యార్థుల ప్రభంజనం



**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** గురువారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నాయుడుపేట పట్టణంలోని విద్య కేంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా విద్యకేంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ పి శ్రీనివాసులు రెడ్డి, ప్రిన్సిపాల్ డి రామిరెడ్డి అత్యుత్తమ మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు శాలువాలు కప్పి సన్మానించి అభినందించారు. అనంతరం వారికి నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు సాధించిన పదో తరగతి పరీక్ష ఫలితాల వివరాలను తెలియజేశారు. ఎస్ శ్రీనిధి 595 మార్కులతో స్టేట్ ర్యాంకు సాధించడంతోపాటు టౌన్ ఫస్ట్‌లో నిలిచారని తెలిపారు. ఎస్ డి సుహాన ఫరహీన 593 మార్కులతో స్టేట్ ర్యాంక్‌తో పాటు టౌన్ థర్డ్ స్థానంలో నిలిచారని తెలిపారు. పి సూర్య 591 మార్కులతో స్టేట్ ర్యాంక్‌తో పాటు టౌన్ ఫిఫ్త్ ర్యాంకు సాధించాలని తెలియజేశారు. పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో 50 శాతం మంది విద్యార్థులు 500 కు పైగా మార్కులు సాధించినట్లు తెలియజేశారు. పాఠశాల స్థాపించిన 14 సంవత్సరాల నుండి తమ పాఠశాల విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధిస్తూ రికార్డు సృష్టిస్తున్నారని తెలియజేశారు.

# తెదేపా కార్యాలయ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం నియోజకవర్గ కేంద్రం ఆయన పెద్దా పురం పట్టణంలో నిర్మిస్తున్న తెలుగుదేశం పార్టీ కార్యాలయ పనులను గురువారం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పరిశీలించారు. పనుల నాణ్యతను పనుల వేగవతాన్ని ఆయన పరిశీలించి త్వరితగతన పనులు పూర్తయ్యేలా చూడాలని సంబంధిత కాంట్రాక్టర్కు ఆయన సూచించారు. అలాగే కార్యాలయంలో ఉండాల్సిన వసతులపై కాంట్రాక్టర్‌తో మాట్లాడి పలు సూచనలు అందజే శారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, తదితరులున్నారు.

# సంపాదకీయం

## అంతంలేని ఆయుధప్రేమ.. అంతేనయా!

ఆయుధంతో అన్నీ సాధించాలనే లక్ష్యం ఉన్నవారు చివరకు దానికే బలి అవుతారని మనం తరచూ వింటూంటాం. హింసతో అంతిమంగా దేన్నీ సాధించలేమని చెప్పటానికి ఇట్లాంటి హితబోధనలు 20వ శతాబ్దంలో బాగా ప్రాచుర్యం పొందాయి. రాజకీయాధికారాన్ని పొందటానికి ప్రజాస్వామ్యం శాంతిమార్గాన్ని ఏర్పరచిందనీ, సమాజంలో సమూల సంస్కరణలను అమల్లో పెట్టాలనుకునే వారందరూ ఆ మార్గంలోనే నడవాలనటంలో అమెరికా పాలకులే ముందంజలో ఉన్నారు. ఆ తరహా బోధనలకూ, హితోక్తులకూ అనుగుణంగా అమెరికా వ్యవహరిస్తోందా? అని ప్రశ్నించుకుంటే జవాబు భయానకంగా ఉంటుంది. తుపాకీ సంస్కృతికి వందలేళ్ల నుంచి పెద్దపీట వేసిన దేశం 21వ శతాబ్దంలోనూ దాన్ని వదిలించుకోలేకపోతోంది. ఏప్రిల్ 25న శ్వేతసౌధంలో విలేఖరులకు ఇచ్చే విందు సమావేశంలో జరిగిన కాల్పుల ఘటన అమెరికా తుపాకీ సంస్కృతికి ఒక మచ్చుతునక మాత్రమే. అయినా ఆ సంస్కృతికి స్వస్తి చెప్పటానికి అవసరమైన చర్యలను అమెరికా పాలకులు తీసుకోలేకపోతున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నూ, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌నూ ఇతర మంత్రులనూ కాల్పులబారిన పడకుండా కాపాడటం తన సమర్థతకు గీటురాయిగా రహస్య పోలీసు విభాగం ప్రకటించుకుంది. అదే సమర్థతను అన్ని సందర్భాల్లోనూ ప్రదర్శించిన దాఖలాల్లేవు. అమెరికా చరిత్రలో నలుగురు అధ్యక్షులు తుపాకీ గుళ్లతో ప్రాణాలను కోల్పోయారు. నల్లజాతి ప్రజలకు సమాన హక్కులు ఉండాలని పోరాడిన మార్టిన్ లూథర్ కింగ్ సైతం తుపాకీ సంస్కృతికి బలైపోయారు. మార్టిన్ లూథర్ కింగ్ వల్లే పౌరసమానత్వం అమెరికాలో సాధ్యమైంది. 1964 నాటి పౌరహక్కుల చట్టం అమెరికా చరిత్రలోనే ఒక కీలక మలుపు లాంటిది. రంగు, జాతి, లింగం, మతంతో ప్రమేయం లేకుండా పౌరహక్కుల్లో అందరికీ సమానత్వం లభించే పరిస్థితి అంతకు ముందు అమెరికాలో లేదు. దేశాధినేతల మరణాలకే కారణమైన తుపాకీ సంస్కృతి ప్రజల జీవితాల నుంచి జారిపోకుండా దాన్ని పదిలంగా కాపాడటానికి పెద్ద లాబీనే అమెరికాలో పనిచేస్తోంది. అమెరికాలో పరిశ్రమాధిపతులూ, పెట్టుబడిదారులూ తమ ప్రయోజనాలను కాపాడుకోటానికీ పెంచుకోటానికీ రాజకీయ నేతలను బహిరంగంగానే ప్రభావితం చేస్తారు. కోట్ల డాలర్లను అందుకోసం కుమ్మరిస్తారు. తమ తరఫున పని చేయటానికి లాబీయింగ్ చేసే సంస్థలతో ఒప్పందాలనూ కుదుర్చుకుంటారు. ఎంతగా లాబీయింగ్ చేసినా తక్షణావసరం లేని పిస్టళ్లనూ, రివాల్వర్లనూ, హ్యాండ్‌గన్లనూ ప్రజలు ఎందుకు కొంటున్నారన్న ప్రశ్న తలెత్తుతుంది. నిరంతర అభద్రత అనేది ఇప్పటి అమెరికన్ల జీవితాల్లో కనపడదు. అసాధారణ నేరాలు జరిగే పరిస్థితులూ అక్కడలేవు. కనీసం సరిహద్దు ప్రాంతాల్లో అటువంటివి ఎక్కువ జరుగుతున్న దాఖలాల్లేవు. అయినా ప్రపంచంలో ఎక్కడా లేనట్లుగా అక్కడి ప్రజలు ఆయుధాలను కొంటూనే ఉంటారు. తుపాకులను ఉంచుకోవటం ధీరోదాత్తలక్షణంగా, వీరోచిత వారసత్వం కొనసాగింపుగా, వ్యక్తి స్వతంత్రకు నిదర్శనంగా ప్రజల సంస్కృతిలో, ఆలోచనల్లో నాటుకుపోయేలా చేయటంలో అక్కడి ఆయుధ పరిశ్రమల లాబీ విజయవంతమైంది. అలా అవ్వటానికి కథలనూ, కవిత్వాలనూ, సినిమాలనే కాదు.. ఒక్క మాటలో చెప్పాలంటే అన్ని సాంస్కృతిక రూపాలనూ ఉపయోగించుకున్నారు. తుపాకీని ప్రయోగించటం, పేల్చటం పురుష లక్షణంగా, కుటుంబ సంరక్షకుడికి ఉండాల్సిన నేర్పరితనంగా, సాహసగుణానికి ప్రతీకగా ప్రజలు భావించేలా చేయగలిగారు. కౌబాయ్‌ల జీవితాల చుట్టూ అల్లిన కథలూ గాథలూ అందులో భాగమే. సినిమాలను ఉపయోగించుకుని కౌబాయ్‌ల తుపాకీ సాహస విన్యాసాలపై చాలా ఆసక్తిని కలిగించారు. సంస్కృతి అనేది ఒక్క ఏడాదిలో ఏర్పడదు. దానికి దశాబ్దాల, శతాబ్దాల కాలం కావాల్సి వస్తుంది. తుపాకీ కలిగి ఉండటం అన్నది సంస్కృతిలో ప్రధానభాగం కావటం అమెరికాలో ఆషామాషీగా జరగలేదు. దానికి శతాబ్దాల చరిత్ర ఉంది. అమెరికా ఖండంలో స్థానికజాతులతో యుద్ధాలు, వాళ్ల భూములను ఆక్రమించుకోవటాలు, వాళ్ల నుంచి నిరంతరం రక్షించుకోవాలన్న అవసరాలు అక్కడి చరిత్రలో ఒకనాడు ప్రధానమైనవి. వీటితోపాటు తుపాకుల తయారీ ఒక పరిశ్రమగా పాదుకున్న తర్వాత దానికి ఇంటాబయటా నిరంతరం మార్కెట్‌ను విస్తరించుకోవాల్సిన ఆధునిక వ్యాపార అవసరమూ ఏర్పడింది. ఈ రెండు కారణాలు అమెరికాలో తుపాకీ సంస్కృతి బలపడటానికీ కొనసాగటానికీ కీలకంగా పనిచేశాయి. ఇంకా చేస్తున్నాయి కూడా. అమెరికా స్వాతంత్ర్యం ప్రకటించుకున్న నాటికి 13 వలస రాష్ట్రాలే ఉన్నాయి. బ్రిటన్ నుంచి అమెరికా స్వాతంత్ర్యాన్ని ఖాయపరిచిన 1783 ప్యారిస్ ఒప్పందం నాటికి ఆ రాష్ట్రాల కింద 2.3 మిలియన్ చదరపు కిలోమీటర్ల భూభాగమే ఉండేది. ప్రస్తుత అమెరికా విస్తీర్ణం 9.8 మిలియన్ చదరపు కిలోమీటర్లు. ఇంత విస్తీర్ణంలో అమెరికా అజమాయిషీ వ్యాప్తిచెందటానికి దశాబ్దాలు పట్టింది. 1783 నుంచి 1959 వరకూ అది కొనసాగింది. ఆ దశను ప్రధానంగా పశ్చిమ విస్తరణగా పేర్కొంటారు. అట్లాంటిక్ సముద్రాన్ని అంటి ఉన్న రాష్ట్రాల నుంచి పసిఫిక్ సముద్రం వరకూ అమెరికా విస్తరించటం మామూలుగా, ప్రశాంతంగా జరగలేదు. ఆ విస్తరణ కాలంలో స్థానిక జాతులతో, ప్రజలతో అనేక యుద్ధాలు చేయాల్సి వచ్చింది. కానీ ఆనాటి అన్ని సంఘర్షణలూ, యుద్ధాలూ చరిత్రలోకి ఎక్కలేదు. ఎందుకంటే పరాజితుల సంపూర్ణచరిత్రలు విజేతల జ్ఞాపకాల్లోకి చేరవు. విజయానికి తోడ్పడ్డ ఘటనలకే అవి పరిమితం అవుతాయి. పశ్చిమ విస్తరణ కాలంలో చిన్నవీ పెద్దవీ కలిసి 100కు పైగా యుద్ధాలు, సంఘర్షణలు జరిగాయని మాత్రమే ఇప్పటివరకూ తెలుస్తోంది. ఇక స్థానిక జనాభా గురించిన లెక్కలు కూడా కచ్చితమైనవి లేవు.

# అనాథ క్యాన్సర్ పేషెంట్‌కి వాసుపల్లి రూ. 5,000 ఆర్థిక సాయం

### - జాలరి వర్గానికి చెందిన చింతపల్లి లక్ష్మణరావుకు అండగా మాజీ ఎమ్మెల్యే




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దక్షిణ నియోజక వర్గంలో 39వ వార్డులో ఒంటరిగా జీవిస్తున్న జాలరి వర్గానికి చెందిన క్యాన్సర్ పేషెంట్ చింతపల్లి లక్ష్మణరావుకు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అండగా నిలిచారు. ఇక్కడి కొంతమంది యువత ఆ వృద్ధుడికి ఆసరా కల్పించగా చిన్న షెడ్‌లో జీవితం సాగిస్తున్నాడు. 39వ వార్డ్ వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు ముజీబ్ ఖాన్, స్తానిక యువత కలిసి వాసుపల్లి గణేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్ళారు. విషయం తెలుసుకొని నేరుగా వెళ్లి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి భరోసా కల్పించారు. అలాగే కేజీహెచ్ సూపరింటెండెంట్‌తో మాటాడి మెరుగైన వైద్యం అందించాలని వాసుపల్లి కోరారు. అవసరమైన మెడికల్ ఖర్చులకు తాను సహాయం చేస్తానని వాసుపల్లి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సత్య, వెంకటి, సలీం, ధనరాజు, రవి, కాసుబాబు, స్టేట్ నాయకులు సంస్కృత విభాగం సెక్రటరీ సాగర్, చేపల నూకరాజు 39వ వార్డు వైసిపి శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి నాదెండ్లకు ఘన నివాళులు

### - మంత్రి నాదెండ్ల మనోహర్‌కు గంట్ల దంపతులు పరామర్శ

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా సేవలందించిన నాదెండ్ల భాస్కరరావు మృతి చెందడం అత్యంత విచారకరమని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు డాక్ యార్డ్ కేటీబి అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు దంపతులు పేర్కొన్నారు. ఈ మేరకు హైదరాబాదు లోని ఆయన నివాసంలో నాదెండ్ల భాస్కర్ రావు చిత్రపటానికి గంట్ల శ్రీనుబాబు దంపతులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే నాదెండ్ల కుమారుడు జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల ముఖ్య నేత రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు దంపతులు పరామర్శించారు. ఆయా అంశాలపై మాట్లాడిన అనంతరం వీరు మంత్రి మనోహర్‌కు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ



ముఖ్యమంత్రి దివంగత నేత నాదెండ్ల భాస్కరరావు ఆత్మకు పవిత్ర శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని గంట్ల దంపతులు ఆకాంక్షించారు.


# పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జే.డి శీలంని సన్మానించిన సబ్బవరపు శ్రీధర్





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఉత్తరాంధ్ర జిల్లాలో కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చెయ్యాలని మాజీ కేంద్ర మంత్రి, ఏపీసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జే.డి.శీలం వైజాగ్ పర్యటనకు వచ్చిన సందర్భంగా సిటీ కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించిన ఆఫీస్ ఇంచార్జ్ సబ్బవరపు శ్రీధర్. ఈ సందర్భంగా జే.డి శీలం మాట్లాడుతూ వైజాగ్ సిటీ పరిధిలో ఉన్న అన్ని నియోజక వర్గాలలో కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో పని చేసిన వారిని గుర్తించి పదవులు ఇవ్వటం జరుగుతుందన్నారు.

# ఘనంగా బటర్ ఫ్లై వరల్డ్ ఎగ్జిబిషన్ ప్రారంభం








**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** స్థానిక జేఎన్టీయూ ఎదురుగా ఉన్న మైదానంలో బటర్ ఫ్లై వరల్డ్ ఎగ్జిబిషన్ గురు వారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూము బన్ను హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు వేసవి సెలవులను ఆనందంగా గడిపేందుకు ఈ ఎగ్జిబిషన్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు వీరభద్ర రావు మాట్లాడుతూ, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సహకారంతో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిల్లలు, పెద్దలను ఆకట్టుకునే విధంగా విభిన్న ఆకర్షణలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇక్కడ సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఫ్యాన్సీ వస్తువులు, గృహోపకరణాలు సరసమైన ధరల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. చిన్నారుల వినోదం కోసం జెయింట్ వీల్, ఆట వస్తువులు వంటి ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేసినట్లు తెలిపారు.

# డీజిల్ కొరత ఆరోపణలపై కూటమి నాయకుల కౌంటర్

**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** డీజిల్ అందుబాటులో లేదంటూ వైసీపీ నాయకుడు కురసాల కన్నబాబు చేసిన ఆరోపణలకు కూటమి నాయకులు ఘాటుగా స్పందించారు. కరప మండలం కరప చంద్రన్న సమావేశ మందిరంలో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వ అధినేతలు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకా రంతో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా బురద జల్లే వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. రైతులు డీజిల్ కొరతతో ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఈ నెల 27వ తేదీ నుంచి పంట కోత యంత్రాలకు డీజిల్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఈ రబీ సీజన్‌లో 17,214 మంది రైతులు 19,283 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు వెల్లడించారు. గత మూడు రోజులుగా 161 వరి కోత యంత్రాలకు 358 కూపన్ల ద్వారా ఒక్కో కూపన్‌కు 70 లీటర్ల చొప్పున మొత్తం 25,060 లీటర్ల డీజిల్ సరఫరా చేశామని చెప్పారు. దీంతో ఎటువంటి అంతరాయం లేకుండా సుమారు 5,430 ఎకరాల్లో వరి కోత పనులు పూర్తయ్యాయని అధికారుల నివేదికను ఉదహరించారు. అసత్య ఆరోపణలు చేస్తున్న కన్నబాబు గ్రామాల్లోకి వచ్చి రైతులను నేరుగా అడిగి వాస్తవాలు తెలుసుకోవాలని, అవసరమైతే బహిరంగ చర్చకు రావాలని కూటమి నాయకులు సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, ముద్రగడ రమేష్, పీజీ, దూడల నారాయుడు, మెండు గోవింద్, సైనవరాపు శంకర్, యాళ్ల పండు, గొల్లపల్లి శేఖర్, జోకా తాతాజీ, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన స్టేట్ అబ్జర్వర్



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** 2026-27 విద్యా సంవత్సరంనకు గానూ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్‌ను భద్రపరచు స్టాక్ పాయింట్‌ను స్టేట్ అబ్జర్వర్ పుష్పాంజలి గురువారం పరిశీలించారు. సామర్లకోట మండలం స్టాక్ పాయింట్ గిరిజన బాలుర ఉన్నత పాఠశాల బ్రౌన్ పేటలో ఏర్పాటు చెయ్యగా దానిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ తనిఖీలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్‌లోని వస్తువులను భద్రపరచు రూములను పరిశీలించి, సెక్యూరిటీతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్టేట్ అబ్జర్వర్ వెంట మండల విద్యాశాఖ అధికారి 2 పి.పుల్లయ్య, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ మండల స్టాఫ్ సుబ్రహ్మణ్యం, సిఆర్పిలు శ్రీనివాస్, తనుజ, వీర్రాజు తదితరులు ఉన్నారు.

# అందరి సమిష్టి కృషి

### - విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించిన కలెక్టర్ మహేష్ కుమార్

### - 10వ తరగతి ఫలితాల్లో అంబేద్కర్ కోనసీమ జిల్లా ఘనత...రాష్ట్రంలో ద్వితీయ స్థానం



**అమలాపురం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ విజయానికి ప్రధాన కారణం జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సమిష్టి కృషి అని అన్నారు. జిల్లా విద్యా అధికారి ఆధ్వర్యంలో పాఠశాలల్లో నాణ్యమైన బోధన, ప్రత్యేక శ్రద్ధ, పునశ్చరణ తరగతులు, పరీక్షల పట్ల అవగాహన కార్యక్రమాలు సమ ర్థవంతంగా నిర్వహించడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని కలెక్టర్ అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ మంచి ఫలితాలు సాధించారని, ఉపాధ్యాయులు చూపిన అంకిత భావం ప్రశంసనీమని కొనియాడారు. భవిష్యత్తులో జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించేలా మరింత కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారికి మార్గదర్శకులైన ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు అభినందనలు తెలిపారు.

# 9 ఏళ్ల తర్వాత చియాన్ విక్రమ్ మూవీకి మోక్షం!




కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ గౌతమ్ వాసుదేవ్ మీనన్ గత కొన్నేళ్లుగా ఊహించని ఆర్థిక, న్యాయ వివాదాల్లో చిక్కుకుని తన ఉనికిని కోల్పోయిన సంగతి తెలిసిందే. క్లాసిక్ సినిమాలను తెరకెక్కించడంలో మేటి ప్రతిభావంతుడిగా గుర్తింపు ఉన్నా చేపట్టిన ప్రాజెక్టుల ఆలస్యం ఆయనను బ్యాక్ బెంచీకే పరిమితం చేశాయి. ముఖ్యంగా చియాన్ విక్రమ్ హీరోగా గౌతమ్ వాసుదేవ మీనన్ రూపొందించిన ప్రతిష్టాత్మక స్పై థ్రిల్లర్ ధ్రువ నక్షత్రం ఎప్పుడో పూర్తి కావాల్సి ఉన్నా.. అడ్డంకులు దాటలేక ఏళ్ల తరబడి ల్యాబ్‌కే పరిమితమైంది. అయితే తాజాగా మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో ఈ సినిమా విడుదలకు ఉన్న ప్రధాన అడ్డంకులు తొలగిపోయాయి. ఈ కేసును విచారించిన జస్టిస్ సెంథిల్ కుమార్ రామమూర్తి జూన్ 15వ తేదీన లేదా అంతకంటే ముందే సినిమాను థియేటర్లలో విడుదల చేసేలా మార్గాన్ని సుగమం చేశారు. ఇన్వెస్టర్లు కె.పున్నియమూర్తి, కె.ప్రేమ్ కుమార్ తమకు రావలసిన బకాయిల విషయంలో సానుకూలంగా స్పందించడంతో కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. అయితే పారదర్శకత కోసం ఒక ప్రత్యేక ఆర్థిక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోర్టు సూచించింది. దీనివల్ల గౌతమ్ మీనన్ తదుపరి దశ పనులను వేగవంతం చేసే అవకాశం దక్కింది. కోర్టు ఉత్తర్వుల ప్రకారం... కొండాడువోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ పేరుతో ఒక ప్రత్యేక బ్యాంక్ ఖాతాను తెరవాలి. సినిమా ద్వారా వచ్చే ఆదాయం అంతా ఈ ఖాతా ద్వారానే జరగాలి. అంతేకాకుండా.. ఆదాయం – ఖర్చులను పర్యవేక్షించడానికి ఒక న్యాయవాదిని కూడా నియమించాలని కోర్టు ఆదేశించింది. భాగస్వాములకు ఎలాంటి జీతాలు లేదా లాభాల వాటాలు కోర్టు అనుమతి లేకుండా ఇవ్వకూడదని కఠినమైన షరతులు విధించింది. ఈ నిబంధనల వల్ల ఇన్వెస్టర్లకు భరోసా కలగడంతో విడుదల ప్రక్రియ సజావుగా సాగనుంది. వాస్తవానికి ఈ సినిమా ప్రయాణం 2017లో మొదలైంది. కోవిడ్ ప్రభావం, ఆర్థిక ఇబ్బందుల వల్ల షూటింగ్ ఆలస్యమవుతూ వచ్చింది. 2023లో చిత్రీకరణ పూర్తయి అదే ఏడాది నవంబర్ 24న విడుదల కావాల్సిన సినిమాను ఆర్థిక వివాదాల వల్ల చివరి నిమిషంలో నిలిపివేశారు. ఆ తర్వాత ఫిబ్రవరి 2024లో కూడా ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కలేదు. ప్రస్తుతం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో గౌతమ్ మీనన్ పాత బకాయిలను క్లియర్ చేసి.. పంపిణీదారులతో చర్చలు జరిపి త్వరలోనే అధికారిక విడుదల తేదీని ప్రకటించనున్నారు. ఈ చిత్రంలో విక్రమ్ సరసన రీతూ వర్మ కథానాయికగా నటించగా.. వినాయకన్, పార్థిబన్, సిమ్రాన్, రాధికా శరత్‌కుమార్ వంటి దిగ్గజ తారాగణం కీలక పాత్రలు పోషించారు. హారిస్ జయరాజ్ సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ కానుంది. ఏళ్ల తరబడి వేచి చూస్తున్న అభిమానులకు.. విక్రమ్ కెరీర్‌లో అత్యంత స్టైలిష్‌గా తెరకెక్కిన ఈ స్పై థ్రిల్లర్ ఒక గొప్ప అనుభూతిని ఇస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఒకవేళ జూన్ 15 గడువు లోపు సాంకేతిక కారణాల వల్ల విడుదల సాధ్యం కాకపోతే.. తిరిగి కోర్టును ఆశ్రయించి పొడిగింపు కోరే వెసులుబాటును కూడా న్యాయస్థానం కల్పించింది.

ఆలస్యం ప్రభావం అలా ఉంటుంది: ఏళ్ల తరబడి వాయిదా పడటం అనేది ఏ సినిమాకైనా ఒక పెద్ద సవాలే, ఎందుకంటే కాలక్రమేణా ప్రేక్షకుల అభిరుచులు మారిపోవడం లేదా సాంకేతికంగా ఆ సినిమా పాతబడినట్లు అనిపించే ప్రమాదం ఉంటుంది. అయితే ధ్రువ నక్షత్రం వంటి చిత్రాలకు గౌతమ్ మీనన్ మార్క్ మేకింగ్ .. విక్రమ్ లాంటి నటుడికున్న తిరుగులేని క్రేజ్ వల్ల అంచనాలు అలాగే ఉన్నాయి. సాధారణంగా ఇలాంటి క్రేజీ ప్రాజెక్టులు విడుదలైనప్పుడు మొదటి రెండు రోజులు భారీ ఓపెనింగ్స్ రావడం ఖాయం. కానీ సినిమా దీర్ఘకాలం బాక్సాఫీస్ వద్ద నిలబడాలంటే మాత్రం కంటెంట్ నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా చాలా బలంగా ఉండాలి. లేనిపక్షంలో ఆ ఆలస్యం వసూళ్లపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం కచ్చితంగా ఉంటుంది.

# పాపం చిట్టి.. ఆ పేరే శాపం అయ్యింది!



'జాతిరత్నాలు' సినిమాతో చిట్టిగా తెలుగు ప్రేక్షకులను మెప్పించిన ముద్దుగుమ్మ ఫరియా అబ్దుల్లా. ఈ హైదరాబాదీ అమ్మాయి చూడ్డానికి నార్త్ ముద్దుగుమ్మ అన్నట్లుగా ఉంటుంది. సుదీర్ఘ కాలం పాటు ఇండస్ట్రీలో స్ట్రగుల్ అయిన తర్వాత ఫరియాకు జాతిరత్నాలు వంటి మంచి విజయం దక్కింది. ఆ సినిమాతో నవీన్ పొలిశెట్టితో పాటు అందరికీ మంచి పేరు వచ్చింది. దర్శకుడు అనుదీప్ ఏ స్థాయిలో పాపులర్ అయ్యాడో తెలిసిందే. ఆ తర్వాత ఆయన పెద్దగా హిట్‌లు తీయక పోవడంతో ఆయన క్రేజ్ తగ్గుతూ వచ్చింది. ఇక చిట్టి పాత్రతో పాపులర్ అయిన ఫరియా అబ్దుల్లా ఇండస్ట్రీలో ఓ రేంజ్‌లో దూసుకు పోవాలని ఆశించింది. కానీ తెలుగు అమ్మాయి కావడంతో టాలీవుడ్ క్రేజీ హీరోలు ఈమెను దూరం పెడుతున్నారనే వార్తలు వస్తున్నాయి. పైగా ఈ అమ్మడి హైట్ సైతం సమస్యగా మారిందని ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు.

**జాతిరత్నాలు హీరోయిన్ ఫరియా అబ్దుల్లా....**

ఫరియా గ్లామర్ పాత్రల్లో కనిపించినా, ఇన్‌స్టాగ్రామ్‌లో కాస్త అందాల ఆరబోత చేసినా కూడా తీవ్రమైన విమర్శలు ఎదుర్కొంటుంది. చిట్టి ఇలా ఉందేంటి అంటూ చాలా మంది బాహాటంగానే, ఏకంగా ఆమె టైమ్ లైన్‌కి వెళ్లి మరీ బ్యాడ్ కామెంట్స్ చేస్తున్నారు. ఇతర హీరోయిన్స్ మాదిరి మీరు కాదు అనుకున్నాం. కానీ మేము తప్పు అని నిరూపించారు. మాకు ఈ చిట్టి వద్దు, మీరు చిట్టి మాదిరిగా ఉంటేనే అభిమానిస్తాం అంటూ చాలా మంది ఆమెకు కామెంట్ చేస్తున్నారట. ఈ విషయాన్ని స్వయంగా ఫరియా అబ్దుల్లా చెప్పుకొచ్చింది. ఆమె నటించిన గాయపడ్డ సింహం సినిమా ప్రమోషన్‌లో భాగంగా మీడియాతో మాట్లాడుతూ తన కెరీర్ పట్ల పూర్తి సంతృప్తితో లేనట్లుగా చెప్పింది. తనకు దక్కాల్సిన ఆఫర్లు దక్కడం లేదని కూడా ఆమె బాధ పడుతుంది. అందుకు కారణం తన మొదటి సినిమాలోని పాత్ర అని కూడా ఆమె అభిప్రాయం వ్యక్తం చేసింది.


**సోషల్ మీడియాలో ఫరియా అబ్దుల్లా ఫోటోలు...**

సోషల్ మీడియాలో చిట్టిని అభిమానించే వారు చాలా మంది ఉన్నారు. కానీ ఫరియాను హాట్ లుక్‌లో చూసేందుకు మాత్రం ఇష్టపడటం లేదు. ప్రేక్షకులు మాత్రమే కాకుండా ఫిల్మ్ మేకర్స్ సైతం ఆమెను గ్లామర్ రోల్స్‌లో చూపించేందుకు ఆసక్తి చూపడం లేదు. పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఆమె కూడా అందాల ఆరబోత చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. కానీ ఇండస్ట్రీలో తనను తాను నిరూపించుకునేందుకు గాను అన్ని పాత్రల్లో నటించాలని కోరుకుంటున్నట్లు ఆ ఇంటర్వ్యూలో చెప్పింది. అంతే కాకుండా గ్లామర్ పాత్రలు చేయడం ద్వారా కూడా తనను తాను నిరూపించుకోవాలని చూస్తున్నట్లు పేర్కొంది. అయితే బోల్డ్ లుక్ లో కనిపించిన వెంటనే చాలా మంది ట్రోల్ చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది. చిట్టి పాత్రలో నటించడం వల్లే ఇప్పుడు ఫరియా కెరీర్ ఇలా అయ్యిందని కొందరు అంటున్నారు.

**గాయపడ్డ సింహం సినిమా...**

ఫరియా ప్రస్తుతం 'గాయపడ్డ సింహం' పై చాలా ఆశలు పెట్టుకుంది. విభిన్నమైన పాత్రలో కనిపించబోతున్నట్లుగా ఫరియా చెబుతోంది. దర్శకుడు తరుణ్ భాస్కర్ ఈ సినిమాలో హీరోగా నటించాడు. మానస చౌదరి మరో హీరోయిన్‌గా నటించింది. జేడీ చక్రవర్తి ముఖ్య పాత్రలో నటించిన ఈ సినిమాకు కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహించాడు. మే 1న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ కామెడీ డ్రామా చాలా మందికి కనెక్ట్ కాబోతుందని మేకర్స్ చెబుతున్నారు. యూఎస్ ఏకి వెళ్లాలని కలలు కన్న ఒక యువకుడి జర్నీకి సంబంధించిన కథ ఇది. అతడు చివరకు యూఎస్‌ఏ వెళ్లాడా లేదా అనేది తెలియాలంటే సినిమా చూడాలని తాజా ఇంటర్వ్యూలో చిత్ర యూనిట్ సభ్యులు చెప్పుకొచ్చారు. ఈ సినిమా తర్వాత అయినా ఫరియాకి చిట్టి ట్యాగ్ పోతుందా అనేది చూడాలి.


# నిధి ది గ్రేట్: చద్దన్నం కారణంగా అంత ముద్దొస్తోంది!



సౌందర్యానికి, ఫిట్‌నెస్‌కు కేవలం ఖరీదైన డైట్ ప్లాన్‌లు మాత్రమే అవసరం లేదని.. మన ఇంటి పాతకాలపు వంటకాలు కూడా అద్భుతాలు చేస్తాయని నిధి అగర్వాల్ నిరూపిస్తున్నారు. బూరె బుగ్గలు, కాటుక కళ్లు, ఒంపుసొంపుల నడుముతో కుర్రకారును మంత్రముగ్ధులను చేసే ఈ భామ తన గ్లామర్ రహస్యం చద్దన్నం అని వెల్లడించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. వేకువఝామునే చద్దన్నం తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అపారమని, ఇది శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడమే కాకుండా చర్మ సౌందర్యాన్ని రెట్టింపు చేస్తుందని ఆమె తన అనుభవాన్ని షేర్ చేసారు. నిధి అగర్వాల్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... గత ఏడాది కాలంగా తన ఫేవరెట్ బ్రేక్‌ఫాస్ట్ చద్దన్నమేనని తెలిపారు. షూటింగ్ సెట్స్‌లో అందరూ మోడ్రన్ డైట్ ఫుడ్ తింటుంటే.. తాను మాత్రం క్యారేజ్‌లో చద్దన్నం తెచ్చుకుని తినడం చూసి యూనిట్ సభ్యులు ఆశ్చర్యపోతుంటారని నిధి నవ్వుతూ చెప్పారు. చద్దన్నంలో ఉండే ప్రోబయోటిక్స్ రోగనిరోధక శక్తిని పెంచుతాయని.. కరోనా వంటి వైరస్‌ల నుండి రక్షణనిస్తాయని గతంలో వైద్యులు కూడా పేర్కొన్నారు. నిధి తన ఆహారంలో చద్దన్నంతో పాటు ప్రొటీన్ కోసం కోడిగుడ్లను కూడా తీసుకుంటూ పక్కాగా ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటున్నారు. కెరీర్ పరంగా చూస్తే.. పవన్ కళ్యాణ్ సరసన నటించిన హరి హర వీరమల్లు నిధి కెరీర్‌లో భారీ సినిమా.. కానీ ఆశించిన ఫలితం రాలేదు. అయినా కేవలం అందాల ప్రదర్శనకే పరిమితం కాకుండా.. వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ తానొక పర్ఫార్మర్ అని నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా పెద్ద హీరోల సినిమాల్లో లక్కీ ఛార్మ్‌గా మారిన నిధి ప్రస్తుతం సౌత్ ఇండియాలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా నిలిచారు. రెబల్ స్టార్ ప్రభాస్ సరసన నటించిన ది రాజా సాబ్ కూడా తీవ్రంగా నిరాశపరిచింది. ప్రస్తుతం నిధి తన తదుపరి సినిమాలపై దృష్టి సారించింది. ప్రస్తుత ఆధునిక ప్రపంచం అనవసర పోకడలకు పోకుండా మన సంప్రదాయ ఆహారపు అలవాట్లే మిమ్మల్ని అందంగా ఉంచుతాయని నిధి అగర్వాల్ చెప్పడం విశేషం.

చద్దన్నం లాంటి స్వదేశీ ఆహారం వల్ల మంచి నిద్ర పడుతుందని, అది మానసిక ప్రశాంతతను ఇచ్చి ముఖంలో గ్లో పెంచుతుందని నిధి నిరూపించారు. గ్లామర్ ఫీల్డ్‌లో ఉంటూ కూడా ఇలాంటి సింపుల్ లైఫ్ స్టైల్‌ను అలవర్చుకోవడం వల్లే నిధి ది గ్రేట్ అనిపించుకుంటున్నారు. తదుపరి చిత్రాలతో మరిన్ని విజయాలను అందుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# చిరు-బాబీ సినిమా నిర్మాతకు కాస్త ఊరట




గత కొన్ని నెలలుగా కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ పేరు సోషల్ మీడియాలో ఎంత చర్చ జరుగుతోందో తెలిసిందే. కానీ ఆ సంస్థ పేరు పాజిటివ్ విషయాల్లో చర్చనీయాంశం కావడం లేదు. అన్నీ నెగెటివ్ విషయాలతోనే కేవీఎన్ వార్తల్లోకి వస్తోంది. ఆ సంస్థ ప్రొడ్యూస్ చేసిన 'జననాయగన్' సెన్సార్ చిక్కుల్లో పడి విడుదలకు నోచుకోకుండా ఆగిపోవడం.. మొత్తం సినిమా విడుదలకు ముందే ఆన్ లైన్లో లీక్ అయిపోవడం మీద ఎంత డిస్కషన్ నడిచిందో తెలిసిందే. దీని వల్ల నిర్మాతకు భారీ నష్టమే వాటిల్లింది. మరోవైపు చిరంజీవి, బాబీ సినిమా అనుకున్న సమయానికి మొదలు కాకపోవడం మీదా అందరూ నెగెటివ్‌గానే మాట్లాడుకున్నారు. ఇంకోవైపు కేవీఎన్ ప్రొడ్యూస్ చేసిన 'కేడీ: ది డెవిల్' సినిమా పాట మీద ఆ మధ్య తీవ్ర దుమారం రేగింది. ఇలా ఎటు చూసినా ఈ సంస్థకు తలనొప్పులే కనిపించాయి. ఇలా నెలల తరబడి నెగెటివ్ విషయాలతో సతమతం అయిన కేవీఎన్ సంస్థకు ఎట్టకేలకు ఊరట లభించింది. కేవీఎన్ నిర్మాణంలో తెరకెక్కిన 'కేడీ: ది డెవిల్' ఈ గురువారమే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ చిత్రానికి కన్నడలో మంచి టాక్ వచ్చింది. రివ్యూలు పాజిటివ్‌గా ఉన్నాయి. మౌత్ టాక్ కూడా బాగుంది. క్రిటిక్స్ ఆహా ఓహో అనకపోయినా.. సినిమా గురించి సానుకూలంగా స్పందించారు. ఇది ధ్రువ్ సర్జా హీరోగా నటించిన చిత్రం. అతడి సినిమాలన్నీ చాలా వరకు మాస్ మసాలాలే. మరీ శ్రుతి మించిపోయే మాస్, యాక్షన్ అంశాలుండే తన చిత్రాలకు సాధారణంగా అంత మంచి రివ్యూలు రావు. కానీ 'కేడీ' మాత్రం పాజిటివ్ రివ్యూలు తెచ్చుకుంది. ఎలివేషన్లు, యాక్షన్ ఘట్టాలు అదిరిపోయాయని.. కథ కూడా బాగుందని టాక్ వచ్చింది.

ఈ చిత్రాన్ని రూపొందించింది 'ఇడియట్' ఫేమ్ రక్షిత భర్త ప్రేమ్ కావడం విశేషం. చాలా ఏళ్ల తర్వాత తనకు కూడా హిట్ పడ్డట్లే కనిపిస్తోంది. ఇందులో కిచ్చా సుదీప్ క్యామియోకు అదిరిపోయే రెస్పాన్స్ వస్తోంది. థియేటర్ సెలబ్రేషన్స్ మామూలుగా లేవు. 'కేడీ'ని పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేయాలనుకున్నారు కానీ.. ఇతర భాషల వెర్షన్లకు సెన్సార్ పూర్తి కాకపోవడంతో వారం ఆలస్యంగా రిలీజ్ చేయాలని చూస్తున్నారు. వరుస ఎదురు దెబ్బల తర్వాత కేవీఎన్ సంస్థకు ఈ చిత్రం గొప్ప ఉపశమనాన్నిస్తోంది.


# అభ్యుదయ యుగకర్త మహాకవి శ్రీశ్రీ



**విజయనగరం, (రాజధాని వార్తలు):** తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ జయంతిని గురజాడ అప్పారావు స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా గురజాడ అప్పారావు విగ్రహానికి, మహాకవి శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు సాహితీ చరిత్రలో శ్రీశ్రీ ఒక విప్లవం అని తెలుగు కవిత్వాన్ని సంప్రదాయపు సంకెళ్ల నుంచి విముక్తి చేసి, సామాన్యుడి చెంతకు చేర్చిన యుగకర్త. అని అభివర్ణించారు. జనవిజ్ఞాన వేదిక జాతీయ నాయకులు డాక్టర్ ఎం వి ఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ కవిత్వం అంటే అక్షరాల కూర్పు కాదు, అది ఒక సామాజిక బాధ్యత" అని నిరూపించిన మహనీయుడు శ్రీశ్రీ. ఆయన ప్రవేశపెట్టిన నూతన పోకడలు నేటికీ ఆధునిక తెలుగు కవులకు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని అన్నారు. ఈ సమావే శంలో సమితి ఉపాధ్యక్షులు కాగుపాటి నారాయణమూర్తి, సలహా దారు ముళ్ళపూడి సుభద్రాదేవి, గురజాడ అప్పారావు కుటుంబీ కులు ఇందిరా ప్రసాద్ దంపతులు, అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సేవా సమితి ఉపాధ్యక్షులు డిమ్స్ రాజు, విశ్వ సాహితీ కళావేదిక విజయనగరం జిల్లా అధ్యక్షులు భోగరాజు సూర్యలక్ష్మి, గీతా రాణి, తదితరులు పాల్గొన్నారు.

# మే 3న సంగీత సమారాధన

**విజయనగరం, (రాజధాని వార్తలు):** శ్రీ కామకోటి తౌర్యత్రిక ట్రస్ట్ సమర్పణలో శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యవర్య మూలామ్నాయ సర్వజ్ఞ శ్రీ కాంచీ కామకోటి పీఠాధీశ్వర జగద్గురు శ్రీ శంకరాచార్య శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ మహాస్వామి వారి ఆశీస్సులతో...నడిచే దేవుడు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారి (పరమాచార్య వారి) జన్మ నక్షత్రం అనురాధ నక్షత్రాన్ని పురస్కరించుకొని సంగీత సమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఉపద్రష్ట వేంకట వరప్రసాద్ శర్మ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మూడో తేదీ సాయంత్రం 6 గంటలకు శంకరమఠంలో సంగీత సమారాధనలో భాగంగా తిరువీధుల దేవి సుజాత గాత్రకచేరి ఉంటుందని వయొలిన్ పై మంగళగిరి శ్రీ వ్యాస్, మృదంగం పైన పి.సురేష్ కుమార్ వాయిద్య సహకారం అందిస్తారని విజయనగరం పురప్రజలందరూ పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.



# ఇంటింటి జనగణనకు సర్వం సిద్ధం

## - జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి






**విజయనగరం, (రాజధాని వార్తలు):** రేపటినుంచి ప్రారంభం కానున్న ఇంటింటి జనగణన ప్రక్రియకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి చెప్పారు. గురువారం అమరావతి నుంచి రాష్ట్ర జనగణన నోడల్ అధికారి రావత్, స్టేట్ సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ నివాస్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా జనగణన సన్నద్ధతను పరిశీలించారు. ఈ వీసీలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియలో జిల్లా ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నట్లు చెప్పారు. మనం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రతి ఛార్జ్ ఆఫీసర్ మరియు ఎన్యూమరేటర్ బాధ్యతగా పనిచేస్తున్నారని తెలిపారు.

స్వీయ గణనకు ఈరోజు కూడా అవకాశం ఉందని, క్షేత్ర స్థాయిలో ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నామని వివరించారు. ఇంటింటి గణన ప్రక్రియ మరింత పారదర్శకంగా సాగేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ఎన్యూమరే టర్లందరికీ ఇప్పటికే తగిన శిక్షణ ఇచ్చామని, ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించామని తెలిపారు.

రేపటినుంచి ప్రారంభం కానున్న జనగణనలో రాబోయే మూడు రోజులు అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. నియోజక వర్గాల వారీగా గణన ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. ఈ విసిలో జిల్లా నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్ సేధు మాధవన్, డీఆర్వో సిహెచ్ సత్తిబాబు, మున్సిపల్ కమిషనర్ బాలస్వామి, సిపివో పి.బాలాజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గజపతినగరం సర్కిల్ ఇనస్పెక్టర్‌గా ఎస్.సన్యాసినాయుడు




**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఎస్.సన్యాసినాయుడు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు (హుకుంపేట) నుంచి విజయనగరం జిల్లా గజపతినగరం సి.ఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీ.ఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు సర్కిల్లో ముఖ్యంగా డ్రగ్స్ విషయంపై దృష్టి సారిస్తున్నట్లు విలేకరులకు తెలియజేశారు. సర్కిల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగించినా, కొనుగోలు అమ్మకాలు చేసిన క్షమించేది లేదని సి.ఐ సన్యాసినాయుడు అన్నారు. యువత డ్రగ్స్‌కి బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆయన కోరారు. మహిళలు, పిల్లల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు సి.ఐ అన్నారు. మహిళలు గుడ్ టచ్, బాడ్ టచ్‌లను తెలుసుకోవాలి అని ఆయన సూచనలు చేశారు. అదేవిధంగా మహిళా పోలీసులతో గ్రామాలలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని సి.ఐ సన్యాసినాయుడు తెలియజేశారు. ముఖ్యంగా సైబర్ నేరాలు పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని అనవసరమైన లింక్స్‌ను తెరవద్దని ఆయన అన్నారు. యువత ఐపీఎల్ బెట్టింగ్‌లతో బంగారంలాంటి జీవితం నాశనం చేసుకోవద్దని, ఆన్లైన్ బెట్టింగ్స్ పూర్తిగా మోసపూరితమైనవని ఆయన యువతను ఉద్దేశించి చెప్పారు. ప్రతి ఒక్కరూ జీవితంలో కష్టపడి, కష్టపడిన దానిని మాత్రమే ఆశించాలని ఆయన హితవు పలికారు.

# సీ.ఐ "జి.ఏ.వి.రమణ"కు ఘన వీడ్కోలు





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న జిఏవి రమణకు గురువారం రాత్రి సర్కిల్ పరిధిలోని సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. అదేవిధంగా బదిలీపై వెళ్తున్న స్టేషన్ బూర్జవలస ఎస్సై జి.రాజేష్, మానాపురం ఎస్.ఐ ఆర్. జయంతిలను సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. గురువారం సాయంత్రం స్థానిక శ్రీ కన్వెన్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన సుమారు 21 నెలల పాటు గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పనిచేసిన సేవలను వక్తలు గుర్తు చేసుకుంటూ కొనియాడారు. విధి నిర్వహణలో ఆయన చూపిన అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.సన్యాసినాయుడు, ఎఎంసి చైర్మన్ పివివి గోపాలరాజు, రాపాక అచ్చం నాయుడు చిరంజీవి రాజు, వైకుంఠం ప్రదీప్ కుమార్, సీరం రెడ్డి రాంకుమార్, బుజ్జి రాజు, సబ్ ఇన్స్పెక్టర్లు కే. కిరణ్ కుమార్ నాయుడు, యు.మహేష్, సీతారాం, పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో విశ్వభారతి హైస్కూల్ విద్యార్థుల విజయభేరి



**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** గురువారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నాయుడుపేట పట్టణంలోని విశ్వ భారతి హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి విజయ భేరి మ్రోగించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ రాజనేని గోపాల్ నాయుడు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష ఫలితాల వివరాలను తెలియజేశారు. ఎ.ప్రణీత 600 మార్కులకు గాను 594 మార్కులు సాధించారని తెలిపారు.

అలాగే కె.లిషిత 590 మార్కులు, జి.కావ్య 590 మార్కులు, ఎ హేమన్విత 587 మార్కులు, ఎస్ చార్విక 583 మార్కులు, కె ధనుశ్రీ 581 మార్కులు సాధించాలని తెలియజే శారు. పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు వ్రాసిన 54 మంది విద్యార్థుల్లో 27 మంది విద్యార్థులు 500 ఒక పైగా మార్కులు సాధించారని అన్నారు. 34 ఏళ్లుగా విశ్వ భారతీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని తెలియజేశారు. గత నాలుగే ళ్లుగా తమ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల్లో సగాటికి పైగా 500 పైబడి మార్కులు సాధిస్తున్నారన్నారు. తమ పాఠశాలలో చదివిన అనేకమంది విద్యార్థులు నేడు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడి నేటి విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉన్నారన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి, విద్యార్థులను ప్రోత్సహించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన అధ్యాపక సిబ్బందికి తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.

# మార్కులు తక్కువ వచ్చినా నిరాశ చెందవద్దు : డైరెక్టర్ అనూష



**రేణిగుంట, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా రేణిగుంట పట్టణం నందుగల డాక్టర్ బషీర్ తపస్య స్కూల్ కరస్పాండెంట్ విక్రమ్ శాలి మరియు డైరెక్టర్ అనూష మాట్లాడుతూ.. 2025-26 విద్యా సంవత్సరానికి గాను తమ పాఠశాల నుండి పదవ తరగతి పరీక్షలు రాసిన 39 మంది విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భం గా విక్రమ్ శాలి మాట్లాడుతూ, విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల నిరంతర కృషి తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ అద్భుతమైన ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ముఖ్యంగా 18 మంది విద్యార్థులు 550కి పైగా మార్కులు సాధించడం పాఠశాలకు గర్వ కారణమని ఆయన తెలిపారు. పాఠశాలలో అత్యధికంగా జషువర్ధన్ 590 మార్కులు సాధించగా, పి.బి.తనుశ్రీ 586, షేక్ సుహానా 585, ఆర్. శృతిరాయి 585, కేతన్ 582 మరియు ప్రణీత్ 582 మార్కులతో ప్రతిభ చాటారని వివరించారు. సబ్జెక్టుల వారీగా చూస్తే సోషల్ విభాగంలో 8 మంది, మేథ్స్‌లో 7 మంది, తెలుగులో నలుగురు సైన్స్‌నందు ఇద్దరు విద్యార్థులు 100 కి 100 మార్కులు సాధించారని వారు వెల్లడించారు. అనంతరం డైరెక్టర్ అనూష మాట్లాడుతూ.. విద్యార్థులు మార్కుల విషయంలో ఒత్తిడికి లోనవ్వకూడదని, ఒకవేళ ఆశించిన దానికంటే ఒకటి రెండు మార్కులు తక్కువ వచ్చినా నిరాశ చెందవద్దని సూచించారు. ఇది కేవలం మీ కెరీర్‌లో ఒక ప్రారంభ దశ మాత్రమేనని, ఈ ఫలితాలు మీ భవిష్యత్తు దిశను నిర్దేశించాలే తప్ప అవే అంతిమం కాదని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ విజయం సాధించిన విద్యార్థులందరికీ వారు అభినందనలు తెలియజేశారు.

# సీఎంఆర్‌ఎఫ్‌తో పేద ప్రజలకు ఆరోగ్య రక్ష

## - ఒకే రోజు 68 మందికి 69 లక్షలు అందజేత - అర్హులకు చెక్కులు అందజేసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సీఎంఆర్ఎఫ్ నిధులతో రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్య రక్షణకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే, పొలిట్ బ్యూరో సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం నగరంలోని విపిఆర్ క్యాంపు కార్యాలయంలో 68 మంది లబ్ధిదారులకు 69 లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఇందులో ఎంపీ పరిధిలో 7 మందికి 5 లక్షలు, ఎమ్మెల్యే పరిధిలో 61 మందికి 64 లక్షలు అందించారు. ఎంపీ, ఎమ్మెల్యే పరిధిలో ఇప్పటివరకు దాదాపు 10 కోట్ల విలువైన చెక్కులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ... పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు కోట్లాది రూపాయల సీఎంఆర్ఎఫ్ నిధులు ఇస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చంద్రబాబు నాయుడులాంటి మానవతావాది ముఖ్యమంత్రిగా ఉండటం ప్రజల అదృష్టంగా అభివర్ణించారు. పేద కుటుంబాలలో ఎవరికైనా పెద్ద జబ్బు చేసి ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోతే నేనున్నానంటూ సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నారని చెప్పారు. 23 నెలల కాలంలోనే కోవూరు నియోజకవర్గంలో 804 మంది బాధితులకు 8.47 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందచేశామన్నారు. పేదల గుండెల్లో ధైర్యాన్ని నింపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలియచేసారు.

# మండలంలో నెంబర్ వన్ మార్కులు సాధించిన ఖాన్స్ రైన్బో

## - విద్యార్థుల మెరుగైన ప్రతిభతో స్కూల్ రికార్డు ఫలితాలు


జి.బాను 592


జి.జస్మిత 592


షేక్ హఫ్సాహ్ 590


సి.మోనిషా రెడ్డి 590


బి. కీర్తిక 590


డి. రీతిక 589

**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంట పట్టణంలోని ఖాన్స్ రెయిన్బో స్కూల్ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచింది. పాఠశాల విద్యార్థులు ఉన్నత మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం దక్కించుకోవడంతో స్కూల్‌కు మంచి పేరు తీసుకు వచ్చారు. ఈ ఫలితాల్లో ద్వైదీప్య, జస్మితా జి, బానుజి ఇద్దరూ 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచారు. మోనిషా రెడ్డి సి, హఫ్సా షేక్, కీర్తిక బి 590 మార్కులు సాధించి ద్వితీయ స్థానాన్ని పొందారు. రీతిక 589 మార్కులు సాధించి తృతీయ స్థానాన్ని దక్కించుకుంది. విద్యార్థుల ఈ అద్భుత ఫలితాలపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో కూడిన బోధన, విద్యార్థుల కృషి వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని కరస్పాండెంట్ అత్తా ఉల్లా ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించింది. అదేవిదంగా 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రకటించారు.

# ముక్కంటి సేవలో తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

## - స్వాగతం పలికిన చైర్మన్ కొట్టేసాయి ప్రసాద్

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీ సమేతంగా శ్రీకాళహస్తీశ్వర స్వామివారి పుణ్యక్షేత్రానికి దర్శనార్థం విచ్చేసి స్వామివారి దివ్య దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ కొట్టే సాయిప్రసాద్, దేవస్థాన ఈవో బి.కె.వెంకటేశులు వారికి హృదయపూర్వక స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం వేద పండితులచే వేదాశీర్వచనం అందించి, శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు, పవిత్ర చిత్రపటం అందజేశారు.



# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి జయంతి వేడుకలు




**కోట, (రాజధాని వార్తలు):** మంచితనానికి మారు పేరు వివాద రహిత నాయకుడు రాజకీయాల్లో అజాత శత్రువు ప్రజలే ఊపిరిగా బ్రతికిన ప్రజా సేవకుడు నల్లపరెడ్డి శ్రీనివాసుల రెడ్డి అని కోట ఆర్యవైశ్య సంఘం సభ్యులు గునుపూడి నందా, తన్నీరు రత్నాకర్ రావు అన్నారు. కోట మండలం కోటలో దివంగత నేత నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి 93 వ జయంతి వేడుకలను గురువారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయ కమిటీ సభ్యులు గునుపూడి నందా, తన్నీరు రత్నాకర్‌రావు ఆధ్వర్యంలో (ఆర్యవైశ్య సంఘం) ఘనంగా నిర్వహించారు. ముందుగా నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు నల్లపరెడ్డి శ్రీనివాసరెడ్డి జ్ఞాప కార్థం వేసవిలో ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు, వాహనదారులకు, సుమారు వెయ్యి మందికి మజ్జిగ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం సభ్యులు మాట్లాడుతూ రాజకీయాలలోకి అడుగు పెట్టిన మొదటి నుండి తుదిశ్వాస విడిచే వరకు ప్రజాసేవకే అంకితమై ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించారని అసెంబ్లీకి ఒక్కరోజు కూడా సెలవు పెట్టకుండా, అసెంబ్లీలో సైతం తన గళాన్ని విప్పి అసెంబ్లీ టైగర్ అనే పేరు తెచ్చుకున్నారని అన్నారు. అధికారంలో ఉన్న లేకపోయినా తన గ్రామాన్ని తన ప్రాంత ప్రజలను ఏనాడు మరచిపోకుండా ప్రజాసేవకు అంకితమైన వ్యక్తి శ్రీనివాసులు రెడ్డి అని అన్నారు. అయినా మంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతో శ్రమించారని, ఆనాడు నిర్మించిన ప్రతి ప్రభుత్వ భవనాలపై, కార్యాలయాలపై, ఎక్కడ చూసినా నల్లపరెడ్డి శ్రీనివాసరెడ్డి పేరే కనిపిస్తుందని అభివృద్ధికి చిరునామా నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు తన్నీరు రత్నాకర్ రావు, గునుపూడి నంద, సొల్లేటి భాస్కర్, సొల్లుటి వెంకటేశ్వర్లు, నున్న లక్ష్మీనారాయణ, పూర్ణచంద్రరావు, అయ్యప్ప సురేష్, దుగ్గిశెట్టి శ్రీనివాసులు, ఓలేటి సత్యం, ప్రసన్న, శ్రీ షిరిడి సాయి అక్షయ సేవా సమితి అధ్యక్షులు అల్లం రమణయ్య, సభ్యులు మల్లికార్జున్, ఆవుల సుబ్బయ్య నల్లపరెడ్ల అభిమానులు పాల్గొన్నారు.

# పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల గొప్ప పురోగతి సాధించిన విద్యార్థులు

## - రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహాజన టీచర్ అసోసియేషన్ దూడల పెంచలయ్య



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరుగుదల పెరిగిందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహాజన టీచర్ అసోసియేషన్ దూడల పెంచలయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దూడల పెంచలయ్య మాట్లాడుతూ 72.8% నుండి 78.39%కి పెరిగిన ఉత్తీర్ణత – ఇది కేవలం సంఖ్య కాదు, ఇది ప్రగతి, పట్టుదల, ప్రతిభకు ప్రతీక. ఈ విజయానికి కారణమైన ఉపాధ్యాయుల అంకితభావం విద్యార్థుల కృషి & పట్టుదల తల్లిదండ్రుల సహకారం ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణలు ప్రభుత్వ పాఠశాలలు ఇప్పుడు నాణ్యమైన విద్యకు ప్రతీకగా నిలుస్తున్నాయి. ఇది ఒక ప్రారంభం మాత్రమే... ఇంకా ఉన్నత ఫలితాల వైపు అడుగులు వేస్తున్న అద్భుత ప్రయాణం. ప్రతి ఉపాధ్యాయుడికి, ప్రతి విద్యార్థికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఇలాగే మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాం. మీ దూడల పెంచలయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మహాజన టీచర్స్ అసోసియేషన్ – ఆంధ్రప్రదేశ్.

# "పది" ఫలితాలలో సత్తా చాటిన అంబేద్కర్ కోనసీమ జిల్లా

## - ఉత్తీర్ణతలో రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచిన అంబేద్కర్ కోనసీమ జిల్లా...ముందంజలో బాలికలు






**అమలాపురం, (రాజధాని వార్తలు):** గురువారం విడుదలైన పదవ తరగతి ఫలితాలలో రాష్ట్రంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సత్తా చాటింది. పదవ తరగతి పరీక్షలలో 95.85 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచింది. అలాగే 600 మార్కులకు గాను 598 మార్కులు సాధించిన శశి మేఘన రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచి అంబేద్కర్ కోనసీమ జిల్లా అంటే విద్యా కుసుమాలు విరబూసే జిల్లాగా తన సత్తాను చాటుకుంది.

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 9570 మంది బాలురు, 9568 మంది బాలికలు మొత్తం 19138 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు వ్రాయగా 9102 ఉంది బాలురు, 9241 మంది బాలికలు మొత్తం 18343 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలురు 95.11 శాతం, బాలికలు 96.58 శాతం ఉత్తీర్ణత సాధించి అం బేద్కర్ కోనసీమ జిల్లా 95.85 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచింది. పదవ తరగతి పరీక్షలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం కామనగరువు ఆదిత్య పాఠశాల విద్యార్థిని పడవల శశి మేఘన 600 మార్కులకు గాను 598 మార్కులతో రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచింది.

**ఉత్తమ మార్కులు సాధించిన విద్యా కుసుమాలు**

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలలో ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదలతో పదవ తరగతి విద్యార్థులు ఉత్తీర్ణతలోనే కాకుండా అత్యధిక మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించి తమ సత్తా చాటుకున్నారు. అమలాపురం రూరల్ మండలం కామనగరువు ఆదిత్య స్కూల్ (ప్రైవేట్ స్కూల్)లో చదివిన పడవల శశి మేఘన 600 మార్కులకు గాను 598 మార్కులు సాధించి రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ పాఠశాలలలో చదివిన విద్యార్థులు మంచి ఫలితా లను సాధించారు. అల్లవరం మండలం సామంత కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన సిరిగినీడి రిషిత లక్ష్మీ నిహారిక 600 మార్కులకు గాను 596 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. కాట్రేనికోన మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నంద్యాల కార్తీక్, గాలి దేవర హర్షిని సత్య దుర్గలు 600 మార్కులకు గాను 595 మార్కులు సాధించి వీరి ఇరువురు జిల్లా రెండవ స్థానంలో నిలిచారు. అమలాపురం రూరల్ మండలం బండారులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని చింతపట్ల జ్యోతిశ్రీ 593, రామచంద్రపురం ద్రాక్షారామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కోన అభిశ్రీ 593, అల్లవరం మండలం ఓడలరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మోక లాస్య 592, సామంత కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కాకిలేటి దేవిశ్రీ ప్రసాద్ 592, ఆలమూరు మండలం డాక్టర్ బి జే జెడ్పి గర్ల్స్ హై స్కూల్ విద్యార్థిని విగాయత్రి 592, మండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కొడవటి భవిక 592, రాయవరం మండలం వెదురుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జిత్తుక దేబోరా బ్లెస్సీ 592, అల్లవరం మండలం కొమరగిరిపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పోతు దుర్గా లక్ష్మి సాహితి 591, రాజోలు మండలం చింతలపల్లి జడ్పీహెచ్ ఉన్నత పాఠశాల విద్యార్థి కొల్లా లక్ష్మీ సాయి అమృత 591 మార్కులు సాధించి టాప్‌లో నిలిచారు.

# ఎమ్మెల్యే పాశంకు శుభాకాంక్షలు తెలిపిన గండవరం సుష్మా రెడ్డి



**కోట, (రాజధాని వార్తలు):** గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పదవి భాధ్యతలు చేపట్టిన సందర్భంగా కోట మండలం తిన్నెలపూడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకురాలు గండవరం సుష్మారెడ్డి ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గండవరం సుష్మారెడ్డి మాట్లాడుతూ నిరంతర ప్రజాసేవ కులు ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్న గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్‌కి తెలుగు దేశం పార్టీ అధిష్టానం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పదవి భాధ్యతలు అప్పగించడం ఆయనకు ఆయన చేస్తున్న ప్రజాసేవకు దక్కిన గౌరవం అని అన్నారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్‌ని ఎమ్మెల్యే స్థాయి నుండి మంత్రిగా చూడాలనే గూడూరు నియోజకవర్గం ప్రజల ఆకాంక్షను త్వరగా తీర్చాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు.

# ఆంధ్రజ్యోతి జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి హత్యకు నిరసన

## - దోషులకు కఠిన శిక్షలు విధించాలని డిమాండ్






**కరప, (రాజధాని వార్తలు):** చిత్తూరు జిల్లా వీ.కోట మండలానికి చెందిన ఆంధ్రజ్యోతి విలే ఖరి జగన్మోహన్ రెడ్డి హత్యను ఖండిస్తూ కరప మండలంలో గురువారం జర్నలిస్టులు నిరసన చేపట్టారు. కరప మండల ప్రెస్ ఫోరమ్ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్ర మాలు, అవినీతి వ్యవహారాలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్న లిస్టులపై దాడులు జరగడం తీవ్ర ఆందోళనకరమని పేర్కొన్నారు. జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డిపై జరిగిన కిరాతక దాడిని ఖండిస్తూ, ఈ ఘటనలో పాల్గొన్న దుండగులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కరప తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ తుమ్మల దుర్గాప్ర సాద్‌కు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కరప మండల ప్రెస్ ఫోరమ్ అధ్యక్షుడు తుమ్మలపల్లి సత్తిబాబు, ప్రెస్ క్లబ్ సభ్యులు డీహెచ్‌వీ సాంబశివ రావు, గునిపే శోభన్ బాబు, మేడిశెట్టి బాబి,సాదే వీరరాఘవులు, మల్లిపూడి వీర వెంకట సత్యనారాయణ మూర్తి (బాబులు), తుమ్మలపల్లి చందు, వాసంశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ కరప మండల యువజన నాయకుడు పెంకే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ అయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES


- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎష్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# నెల్లూరులో ఘనంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం

## - ముఖ్యఅతిథిగా డాక్టర్ సునీత నాయుడు






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని పుర మందిరంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. స్థానిక నాట్య గురువులు మరియు శిష్యుల సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమం వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ముఖ్యంగా 'అష్టలక్ష్మి' వైభవం మరియు శివపార్వతుల నృత్య రూపకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ సునీత నాయుడు విచ్చేసి కళాకారుల అద్భుత ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి దాదాపు 238 మంది చిన్నారులు పాల్గొని తమనాటి ప్రతిభను కనబరిచారు నాట్య గురువుల తమ శిష్యులను తీర్చిదిద్దిన తీరును మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమ విజయానికి అమరావతి కృష్ణారెడ్డి అందించిన సహకారం వెలకట్టలేదని తెలిపారు కళాకారులను ప్రోత్సహించడంలో నెల్లూరు ఎప్పుడు ముందుంటుందని మరోసారి నిరూపితమైంది ప్రభుత్వం కూడా ఇలాంటి ప్రతిభావంతులను గుర్తించి మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరారు.


# కొద్ది రోజుల్లో శంకర్ విలాస్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు వేగవంతం : కేంద్ర మంత్రి పెమ్మసాని

**గుంటూరు, (రాజధాని వార్తలు):** నగరంలోని శంకర్ విలాస్ సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి కోసం చేపట్టిన భూ సేకరణ జులై నాటికి పూర్తి అవుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. మరో పది రోజుల్లో ఈ బ్రిడ్జి నిర్మాణం పనులు వేగవంతం అవుతాయని చెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్-3 పనులు వేగవంతం చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించామన్నారు. శుక్రవారం గుంటూరులో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులతో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమీక్ష నిర్వహించారు. నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం అభివృద్ధికి బిడ్డింగ్ పూర్తయిందన్నారు. వేసవిలో ప్రజల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కొత్తగా 220 ఈ ఆటోలు గుంటూరు నగర పాలక సంస్థకి రానున్నాయని వివరించారు. దీని ద్వారా నగరంలో చెత్త సేకరణ మరింత సులువు అవుతుందని తెలిపారు. మే నెల చివరి నాటికి నగరంలో డ్రైన్ల నిర్మాణం పూర్తి అవుతుందని చెప్పారు. నగరంలో 22 పార్కుల అభివృద్ధికి రూ. 7.2 కోట్లు కేటాయించినట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు. పార్కుల్లో పిల్లలకు ఆట వస్తువులతోపాటు జిమ్ పరికరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. నగరంలో వీధి కుక్కల సమస్య అధికంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నెలకు 125 వీధి కుక్కలకు ఆపరేషన్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి తెలిపారు.

# మూగజీవాలకు వడదెబ్బ.. ఎండలకు సొమ్మసిల్లుతున్న పశువులు

## - జిల్లా వ్యాప్తంగా సుమారు 28 లక్షల పశు సంపద
## - జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు

**వరంగల్, (రాజధాని వార్తలు):** వరంగల్ జిల్లాలో నమోదవుతున్న అత్యధిక ఉష్ణోగ్రతలతో మనుషులే కాదు మూగ జీవాలు సైతం బెంబేలెత్తుతున్నాయి. ఎండ వేడిమికి రోడ్లపై సొమ్మసిల్లి పడిపోతున్నాయి. వేసవిలో పశుపోషణలో సరైన పద్ధతులు పాటించకపోతే పశువులు వడదెబ్బకు గురవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 28 లక్షల పశు సంపద ఉన్నట్లు అంచనా. జిల్లాలో రెండు ప్రాంతీయ వైద్యశాలలతో పాటు, 24 ప్రాథమిక పశు వైద్యకేంద్రాలు, 31 పశువైద్య ఉప కేంద్రాలు, 3 సంచార పశు వైద్యశాలలతో పశు సంవర్ధక శాఖ అధికారులు సేవలందిస్తున్నారు. కాగా, వేసవి ఉష్ణోగ్రతలు ప్రస్తుతం 42 డిగ్రీలకు పైగా నమోదవుతుండటంతో గేదెలు, ఆవులు, గొర్రెలు,మేకలు,పందులు, కోళ్లు, బాతులు తదితర పశు సంపద పట్ల జాగ్రత్తలు వహించాలని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. ఎండల తీవ్రత, అధిక ఉష్ణోగ్రత, వడగాలుల వల్ల ఉష్ణతాపానికి గురై పాడి పశుసంపదలో రోగనిరోధకశక్తి తగ్గి, అనారోగ్యానికి గురయ్యే అవకాశలు ఎక్కువగా ఉంటాయని చెబుతున్నారు. మారుతున్న వాతావరణ మార్పులకు అనుగుణంగా శాస్త్రీయ యాజమాన్య పద్ధతిలో పెంచడం వల్ల వాటి ఉత్పాదక శక్తి తగ్గకుండా రైతులు ఆశించిన ఫలితాలను పొందవచ్చని సూచిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రత, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, షెడ్లలో అధిక సంఖ్యలో కిక్కిరిసి ఉండటం, ఉక్కపోత, నీటి సౌకర్యం అందుబాటులో లేకపోవడం వల్ల పశువులు, గొర్రెలు, మేకలు వడదెబ్బకు గురవుతాయని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. వడదెబ్బకు గురైన పశువులు క్రమంగా నీరసించి బలహీనంగా మారుతాయని, పశువులు సరిగా నడవలేక తూలుతూ పడుకోవడానికి ప్రయత్నిస్తాయని, వడదెబ్బ తగిలిన పశువులకు జీర్ణక్రియ తగ్గిపోవడం, ఆకలి మందగించడం, ఆహారం తక్కువగా తీసుకోవడం జరుగుతుందని చెబుతున్నారు. వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వల్ల ఇతర వ్యాధులు, పరాన్న జీవులు ఆశించే అవకాశం పెరుగుతుందని, కొన్ని సందర్భాల్లో దాహంతో ఉన్న పశువులు మురికి గుంటల్లో ఉన్న నీటిని తాగడం వల్ల



పారుదు వంటి జీర్ణకోశ వ్యాధులు సంభవిస్తాయని హెచ్చరిస్తున్నారు. పాడి పశువులలో గర్భస్రావాలు సంభవించే అవకాశం ఉందని, వడదెబ్బకు గురైన వాటిలో దాహం పెరిగి, తూలుతూ నడుస్తూ పడిపోవడం, రొప్పుతూ, శ్వాస కష్టమవడంతో ఒక్కోసారి అపస్మారక స్థితికి వెళ్ళి మరణిస్తాయని హెచ్చరిస్తున్నారు. పాడిపశువులలో వేసవి తాపంతో జీర్ణక్రియ సన్నగిల్లుతుందని, అందువల్ల సులువుగా జీర్ణమయ్యే గంజి, జావ లాంటి పదార్థాలు ఇవ్వడం మంచిదని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. ఎక్కువ శాతం పచ్చిగడ్డి ఇవ్వాలని, ఒకవేళ మాగుడు గడ్డి సమృద్ధిగా ఉంటే అందించవచ్చని, పచ్చిగడ్డిని ఉదయంవేళలో ఎండుగడ్డిని రాత్రి సమయాలలో ఇవ్వాలని చెబుతున్నారు. అధిక పాలు ఇచ్చే పశువులకు పశుదాణా నీటిలో కలిపి ఇవ్వాలని, మినరల్ మిక్చర్, ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వడం మంచిదని సూచిస్తున్నారు. మేత కోసం పశువులను ఉదయం 6 నుంచి 10గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు మాత్రమే బయటకు పంపించాలని చెబుతున్నారు. వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రదేశంలోకి తీసుకెళ్లి శరీర ఉష్ణోగ్రత తగ్గించడానికి పలుమార్లు నీటితో కడగటం, తల నుదుటి మీద మంచు ముక్కలు ఉంచడం, చల్లని గోనె సంచిని దానిపై కప్పడం వంటివి చేసి వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించాలి. పశు వైద్యాధికారి పర్యవేక్షణలో గ్లూకోజ్ సెలైన్, సోడియం క్లోరైడ్ అందించాలి. శరీర ఉష్ణోగ్రత తగ్గించడానికి అవసరమైన చికిత్స చేయించాలి.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan